thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

అగ్రస్థానానికి అడుగు దూరంలో గిల్

11

# చురకలు

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 114| జగిత్యాల | గురువారం 23 జూలై, 20266 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## చలో సంసద్‌పై పోలీసుల లాఠిన్యం



- అత్యవసర చర్చకు సుప్రీం తిరస్కరణ

4

## 10 ఏళ్లలో 152 పేపర్ లీకులు

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్
- విద్యా వ్యవస్థ రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపణ
- విద్యార్థులకు ప్రధాని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్

4



## నీట్‌పై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం

- ప్రశ్నపత్రం లీక్‌ను 'ఘోర పాపం'గా అభివర్ణించిన ప్రధాని
- ప్రతిపక్షం చర్చకు బదులు ఆందోళనల ఎంచుకుందని కేంద్రం విమర్శ
- విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరీక్షను మళ్లీ నిర్వహించామని వెల్లడి

4






## కాంగ్రెస్ ఓట్లు తొలగించేందుకు
# బీజేపీ ఎత్తులు

- కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు
- ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోండి
- సర్‌పై బూత్‌లెవల్ కార్యకర్తలతో సీఎం రేవంత్



కొడంగల్‌లో తనను రాజకీయంగా బలహీనపరిచేందుకు కుట్రలు జరుగుతున్నాయని, కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల ఆశీర్వాదంతోనే రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం లభించిందని పేర్కొన్న ముఖ్యమంత్రి, రాష్ట్ర స్థాయిలో తనను దెబ్బతీయాలంటే ముందుగా కొడంగల్‌లో పునాదులను బలహీనపరచాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. పేర్లు వేరైనా బీజేపీ, బీఆర్ఎస్ ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నాయని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టుకు నిరసనగా కొడంగల్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో కూడా ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అంబేద్కర్ కూడలిలో జరిగిన నిరసన సభలో మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

## కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ
# ఆందోళనలు

- లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం
- గాంధీభవన్ ముట్టడికి బీజేపీ నేతల దూకుడు
- ఇరువర్గాల పరస్పర దాడులతో ఉద్రిక్తత
- రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు
- నగరంలో పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతల అరెస్ట్





నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టు నేపథ్యంలో బుధవారం తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ఆందోళనలు చేపట్టాయి. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, హన్మకొండలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు కాంగ్రెస్ నాయకులు నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు. లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మహేష్ కుమార్ గౌడ్, దామోదర రాజనర్సింహతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వివరాలు 2లో..

## బీజేపీ కార్యాలయం వద్ద
# ఉద్రిక్త పరిస్థితి



2

- రామచంద్రరావు, ఎమ్మెల్యే రాకేశ్‌ల ముందస్తు అరెస్ట్
- కరీంనగర్‌లో బండి కార్యాలయంపై దాడికి యత్నం

గాంధీభవన్ ముట్టడికి బీజేపీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## రాహుల్ అరెస్ట్‌కు
# నిరసనలు

హన్మకొండలో ఆందోళనలో పాల్గొన్న భట్టి, కొండా సురేఖ

కేంద్రం తీరుపై మండిపడ్డ డిప్యూటీ సీఎం భట్టి

2





## తెలంగాణకు కేంద్రం శుభవార్త

8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలుకు ఆమోదం

2

## సీసీఐ పునరుద్ధరణపై
# మీ వైఖరి ఏంటి

- జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం
- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత కేటీఆర్ లేఖ

3



## ఇండిగో ఉద్యోగినిపై
# క్యాబ్ డ్రైవర్ లైంగికదాడి

- ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అఘాయిత్యం
- ఫిర్యాదు వెంటనే నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- మహిళా ఉద్యోగుల భద్రతపై మళ్లీ ఆందోళనలు

వివరాలు 3లో..



## దాశరథికి కేసీఆర్
# శ్రద్ధాంజలి

2

- అస్తిత్వ స్ఫూర్తిని కొనసాగిద్దామని పిలుపు





# తెలంగాణకు కేంద్రం శుభవార్త

**8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలుకు ఆమోదం**

**హైదరాబాద్, జులై 22:** తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం భుభవార్త తెలిపింది. రాష్ట్రంలో రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా వడ్ల కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న కొనుగోలు లక్ష్యానికి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది. కంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ అమలుపై కూడా కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని అన్ని అర్హత గల వాహనాల్లో వీఎల్టీఎస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి. అంశాలపై పార్లమెంట్‌లో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వడ్ల కొనుగోలు అంచనాను పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధరతో కొనుగోలు జరిగేలా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వ్యవసాయ రంగానికి ఊతమివ్వనుంది. అదనపు కొనుగోళ్లతో రైతులకు ఆర్థిక భరోసా పెరగడంతో పాటు రాష్ట్రంలో ధాన్యం సేకరణ పక్రియ మరింత సాఫీగా సాగేందుకు అవకాశం ఏర్పడింది.

# దాశరథికి కేసీఆర్ శ్రద్ధాంజలి

**అస్తిత్వ స్ఫూర్తిని కొనసాగిద్దామని పిలుపు**



**హైదరాబాద్, జూలై 22:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తన కలాన్ని, గళాన్ని వినిపించిన కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్యులు అందించిన తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ స్ఫూర్తి కొనసాగిద్దాం అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. దాశరథి జయంతి సందర్భంగా కే చంద్రశేఖర్ రావు ఘన నివాళులు అర్పించారు. వారి కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. జైలు గోడల నడుమ బందీ అయికూడా.. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ గర్జించిన తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ సమర యోధుడు దాశరథి అని కేసీఆర్ కొనియాడారు. కృష్ణమాచార్యుల త్యాగాలను, తెలంగాణ అస్తిత్వం కోసం వారు చేసిన సాహితీ పోరాట కృషిని గుర్తించి, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ, వారి పేరున సాహితీ పురస్కారాన్ని నెలకొల్పిందనీ తెలిపారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆత్మగౌ రవం, అస్తిత్వ పరిరక్షణ కోసం రాజులనే ఎదిరించిన కలం వీరుడు దాశరథి కృష్ణమాచార్యులు అందించిన స్ఫూర్తి తెలంగాణ సమాజానికి నేటి అవసరం అని కేసీఆర్ స్పష్టం చేశారు.

# ఇండిగో ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ లైంగికదాడి

**ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి..**

**ఫిర్యాదు వెంటనే నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**

**మహిళా ఉద్యోగుల భద్రతపై మళ్లీ ఆందోళనలు**



**హైదరాబాద్, జూలై 22 :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేస్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ క్యాబిన్ క్రూ ఉద్యోగినిపై ఆమెను విధులకు తీసుకెళ్తున్న క్యాబ్ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడిన ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 20న మధ్యాహ్నం బాధితురాలు విధులకు వెళ్లేందుకు సంస్థ ఏర్పాటు చేసిన క్యాబ్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరింది. క్యాబ్ డ్రైవర్ ఎర్రపోగు ప్రశాంత్ కుమార్ మార్గమధ్యంలో వాహనాన్ని దారి మళ్లించి విమానాశ్రయం సమీపంలోని నిర్మాణంలో ఉన్న ఓ పాఠశాల వద్ద ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ వాహనాన్ని ఆపిన అనంతరం టాయిలెట్‌కు వెళ్తానని చెప్పి కిందకు దిగిన డ్రైవర్, కొద్దిసేపటికే వెనుక సీటు వద్దకు వచ్చి బాధితురాలిపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న శంషాబాద్ ఎయిర్‌పోర్టు అవుట్‌పోస్ట్ పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారం ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు నేరాన్ని అంగ్రీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడిని రిమాండ్‌కు పంపింది. ఈ ఘటనతో శంషాబాద్ విమానాశ్రయం పరిసరాల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఉద్యోగుల రవాణా కోసం ఏర్పాటు చేసే క్యాబ్ సేవల్లో భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# కాంగ్రెస్ ఓట్లు తొలగించేందుకు బీజేపీ ఎత్తులు

- కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు
- ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోండి
- సర్‌పై బూత్‌లెవల్ కార్యకర్తలతో సీఎం రేవంత్



**వికారాబాద్, జూలై 22:** కొడంగల్‌లో తనను రాజకీయంగా బలహీనపరిచేందుకు కుట్రలు జరుగుతున్నాయని, కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల ఆశీర్వాదంతోనే రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం లభించిందని పేర్కొన్న ముఖ్యమంత్రి, రాష్ట్ర స్థాయిలో తనను దెబ్బతీయాలంటే ముందుగా కొడంగల్‌లో పునాదులను బలహీనపరచాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. పేర్లు వేరైనా బీజేపీ, బీఆర్ఎస్ ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నాయని విమర్శించారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 మంది ఓటర్లు ఉండగా, ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ఇప్పటివరకు 1,96,626 మంది మాత్రమే నమోదు చేసుకున్నారని, ఇంకా 54,635 మంది నమోదు చేసుకోలేదని తెలిపారు. మొత్తం ఓట్లలో 22 శాతం నమోదు కాకపోవడం ఆందోళనకరమన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా బూత్ స్థాయి కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన సీఎం, ఈ నెల 30లోగా కొడంగల్‌లో నూటికి నూరు శాతం ఓటరు నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఓటు కోల్పోతే ప్రజాస్వామ్యంలో గుర్తింపే కోల్పోయినట్లేనని వ్యాఖ్యానించారు.

**రాహుల్ అరెస్ట్‌కు నిరసనగా ర్యాలీ**

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టుకు నిరసనగా కొడంగల్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో కూడా ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అంబేద్కర్ కూడలిలో జరిగిన నిరసన సభలో మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాలను లీక్ చేసి విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి, విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం దురదృష్టకరమన్నారు. పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చకు అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనపై పోలీసుల చర్యలను ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ యువత పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని, ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి తొలగించే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి నివాసం నుంచి కొడంగల్ అంబేద్కర్ కూడలి వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ఆందోళనలు

- లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం
- గాంధీభవన్ ముట్టడికి బీజేపీ నేతల దూకుడు
- ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత
- రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు
- నగరంలో పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతల అరెస్ట్



**హైదరాబాద్, జూలై 22:** కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహాతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్-ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

## హన్మకొండలో ఆందోళనలో పాల్గొన్న భట్టి, కొండా సురేఖ



**హన్మకొండ, జూలై 22:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు ను నిరసిస్తూ హన్మకొండ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండ సురేఖతో కలిసి భట్టి విక్రమార్క తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని, ఈ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్న అమాయక విద్యార్థులు, ఆడపిల్లల పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించి లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజల సమస్యలు వినడం మానేసి ప్రశ్నించిన వారిపై దాడులు, అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. లాఠీలతో విద్యార్థుల గొంతును, అరెస్టులతో రాహుల్ గాంధీ పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపలేదని స్పష్టం చేశారు. దేశ యువత భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ దిక్సూచిలా నిలిచి పోరాడుతున్నారని.. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆఖరి వరకు పోరాడతాయని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి దేశంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

## రామచంద్రరావు, ఎమ్మెల్యే రాకేశ్ అరెస్ట్

కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలో భాగంగా హైదరాబాద్ బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. గాంధీభవన్ ముట్టడికి బీజేపీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నేతలు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. నేతల అరెస్టుల సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బీజేపీ నాయకుల అరెస్టుపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం ఎదుట మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన చేశారు. దీనికి నిరసనగా బీజేపీ అగ్రనేతలు గాంధీభవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో హై టెన్షన్ నెలకొంది. కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ నేతలను అడ్డుకునే క్రమంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నంతరం కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో ఆఫీసు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలో ఒకే రోజు బీజేపీ రాష్ట్ర కార్యాలయం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.



# రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు

- ఎల్‌నినో షాక్‌నూ తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ
- దేశంలో తొలిసారిగా 'ఎలక్ట్రిసిటీ అంబులెన్స్'
- డిస్కంలను నం.1గా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క




**హనుమకొండ, జూలై 22:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరిగినా, తెలంగాణ విద్యుత్ వ్యవస్థ సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు ఎక్కడా అంతరాయం లేకుండా నిరంతరాయ విద్యుత్ అందించిందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో పవర్‌కట్ అనే పరిస్థితి లేదని, ప్రకృతి వైపరీత్యాల వల్ల తాత్కాలిక అంతరాయాలను మాత్రమే పవర్‌కట్‌గా భావించవద్దని స్పష్టం చేశారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సాధారణంగా వర్షాకాలంలో 11 వేల మెగావాట్లుగా ఉండే గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఈసారి ఎల్‌నినో ప్రభావంతో 16,500 మెగావాట్లకు చేరిందని తెలిపారు. అదే సమయంలో జలాశయాల్లో నీటి కొరత కారణంగా సుమారు 2 వేల మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయినా, విద్యుత్ శాఖ ముందస్తు ప్రణాళికలు, ఉద్యోగుల కృషితో పరిస్థితిని విజయవంతంగా అధిగమించామని చెప్పారు. కాళేశ్వరం, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాలతో పాటు రైతులు బోర్‌వెల్ల వినియోగం పెరగడంతో విద్యుత్ అవసరాలు భారీగా పెరిగాయని, అయినప్పటికీ ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా కొనసాగించామని పేర్కొన్నారు. విద్యుత్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో 'ఎలక్ట్రిసిటీ అంబులెన్స్' సేవలను ప్రారంభిస్తున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సామగ్రి, నిపుణులైన సిబ్బందితో కూడిన ఈ ప్రత్యేక వాహనాలు అత్యవసర విద్యుత్ సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటాయని తెలిపారు. వినియోగదారులు టోల్‌ఫ్రీ 1912కు ఫోన్ చేస్తే కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థ ద్వారా సమాచారం వెంటనే సంబంధిత అంబులెన్స్‌కు చేరి, అత్యల్ప సమయంలో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తారని వివరించారు. డిస్కంల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు అధిక వడ్డీతో తీసుకున్న పాత రుణాలను పునర్వ్యవస్థీకరించి రుణభారం తగ్గిస్తామని, డిస్కంలను దేశంలోనే అత్యుత్తమ సంస్థలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే ఉద్యోగుల కుటుంబాలకు రూ.1.20 కోట్ల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదాలను నివారించేందుకు లైన్‌మెన్‌లకు అవసరమైన భద్రతా పరికరాలు, యూనిఫాంలు కూడా అందిస్తున్నామని చెప్పారు. 'గృహజ్యోతి' పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాలకు సంబంధించిన బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తోందని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఏటా రూ.14 వేల కోట్ల విద్యుత్ సబ్సిడీని కూడా ప్రభుత్వం నేరుగా విడుదల చేస్తోందని భట్టి విక్రమార్క వెల్లడించారు.

# ఎల్‌నినో సన్నద్ధతపై రాష్ట్ర నిపుణుల కమిటీ తొలి భేటీ

- శాస్త్రీయ విశ్లేషణతో కార్యాచరణ ప్రణాళికకు శ్రీకారం
- వ్యవసాయం, అనుబంధ రంగాలకు అత్యవసర కార్యాచరణపై చర్చ
- 30 శాతం వర్షపాత లోటుపై ఆందోళన వ్యక్తం చేసిన చిన్నారెడ్డి



**హైదరాబాద్, జూలై 22:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులను సమగ్రంగా అంచనా వేసి, వ్యవసాయం, అనుబంధ రంగాల కోసం అత్యవసర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ తొలి సమావేశం బుధవారం ప్రజాభవన్‌లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాల నిపుణులు పాల్గొన్నారు. 27 మంది సభ్యులతో కూడిన ఈ బహుళ విభాగాల కమిటీలో భారత వాతావరణ శాఖ, ఇక్రిశాట్, ఐసీఏఆర్-క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలు, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ, మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్, జాతీయ విత్తన సంస్థ, తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థతో పాటు పలు ప్రభుత్వ శాఖల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గత ఆరు నెలలుగా ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలపై హెచ్చరికలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందనే అంచనాలు వ్యక్తమయ్యాయని చెప్పారు. అయితే జూన్ 1 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటున సుమారు 30 శాతం వర్షపాత లోటు నమోదైందని వెల్లడించారు. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదవగా, మిగిలిన 23 జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి, రైతులు, వ్యవసాయ రంగాన్ని రక్షించేలా ముందస్తు ఉపశమన చర్యలు, అనుసరణ వ్యూహాలతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కమిటీ నిర్ణయించింది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు వివిధ శాఖల సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని సమావేశంలో నిపుణులు సూచించారు.

# నీట్‌పై కేంద్ర వైఖరి దారుణం

**విద్యార్థులపై లాఠీఛార్జీ అమానుషం**

**రాహుల్‌కు మద్దతుగా నిత్యం ఆందోళనలు**

**కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడి**

సంగారెడ్డి, జూలై 22: మూడో సారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి విమర్శించారు. బుధవారం సంగారెడ్డిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా ఢిల్లీలో నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ వేలాది మంది యువత ఆందోళన బాట పట్టారని చెప్పారు. ఆందోళనకు దిగిన వారిని దారుణంగా రక్తం వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీ నివాసాన్ని ముట్టడిస్తే.. ఆయన్ని కూడా అరెస్ట్ చేశారని అన్నారు. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని.. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారని జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీకి మద్దతుగా మంగళవారం హైదరాబాద్ - ముంబై నేషనల్ హైవే ముట్టడించామన్నారు. బుధవారం నల్ల దుస్తులతో నిరసన ర్యాలీ చేశామని చెప్పారు. గురువారం కూడా ఆందోళన చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బ్లాక్ టీషర్ట్‌లు ధరించిన వెయ్యి మంది



కాంగ్రెస్ కేడర్‌తో ఈ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. రాహుల్, ప్రియాంకలతోపాటు విద్యార్థులకు మద్దతుగా ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు చేపడతామని వివరించారు. రాహుల్ గాంధీ ఆందోళన చేసినన్ని రోజులు సంగారెడ్డిలో ఆందోళనలు జరుగుతూనే ఉంటాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు విచారణ

**సోమవారానికి వాయిదా వేసిన హైకోర్టు**

**విచారణకు రంగంలోకి దిగిన ఉమెన్ సేఫ్టీ డీసీపీ**

**హైదరాబాద్:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. కేసుకు సంబంధించిన వివరాలు సమర్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. పిటిషనర్ ట్రైనీ ఐపీఎస్ గా ఉన్నారని.. అప్పటి వరకు తదుపరి చర్యలు చేపట్టకుండా పోలీసులను ఆదేశించాలంటూ అతని తరఫు న్యాయవాది కోరినా హైకోర్టు అంగీకరించలేదు. తప్పుడు ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారని, ఆ కేసును కొట్టివేయాలని ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌లో కోరారు. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు మేరకు అతనిపై అత్తాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. లైంగికంగా వేధించడంతో పాటు.. వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి ఇబ్బందులకు గురి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో



పోలీసులు వేగం పెంచారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసును పోలీసు ఉన్నతాధికారులు ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు బదిలీ అనంతరం డీసీపీ లావణ్య బుధవారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీకి చేరుకుని దర్యాప్తు ప్రక్రియను ప్రారంభించారు. కేసులో ఫిర్యాదు చేసిన ట్రైనీ ఐపీఎస్ అధికారి వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి ఆమె అకాడమీకి వెళ్లారు. అకాడమీలో ఉన్నతాధికారుల సమక్షంలో ట్రైనీ ఐపీఎస్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు. ఈ వాంగ్మూలం కేసు దర్యాప్తులో అత్యంత కీలకంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు, అందుబాటులో ఉన్న డిజిటల్, ఇతర ఆధారాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించనున్నారు. మహిళా భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఈ కేసును ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు దర్యాప్తు సమయంలో అకాడమీలోని అధికారులు, సహచర ట్రైనీలు, ఇతర సంబంధిత వ్యక్తుల వివరాలను కూడా సేకరించే అవకాశం ఉంది. కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించి వాస్తవాలను ప్రత్యేక దర్యాప్తు బృందం వెలుగులోకి తీసుకురానుంది. డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ స్వయంగా పర్యవేక్షిస్తున్న ఈ విచారణలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చే వాంగ్మూలం కీలక ఆధారంగా మారనుంది. ఈ తాజా పరిణామాలతో ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది.



# సీసీఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి

**జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం**

**సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత కేటీఆర్ లేఖ**

**హైదరాబాద్, జూలై 22:** ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదిలాబాద్ అభివృద్ధికి సీసీఐ పునరుద్ధరణ కీలకమని.. రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని.. సీసీఐపై ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీసీఐ సాధన సమితి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు / ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷-లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ఎ÷-లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.

# ట్రాన్స్‌కో డీఈ ముత్యం ఇంటిపై ఏసీబీ దాడులు

**భారీగా ఆస్తులు, బంగారం, నగదు గుర్తింపు**



**హైదరాబాద్, జూలై 22:** హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతంలో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. గత 12 గంటలుగా కొనసాగుతున్న ఈ తనిఖీల్లో రెండు ప్రత్యేక బృందాలు పాల్గొన్నాయి. మొత్తం 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టిన అధికారులు, నగదు, కీలక పత్రాలు, బంగారం, వజ్రాభరణాలు, విదేశీ మద్యం బాటిళ్లతో పాటు కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ముత్యం వెంకటరమణ ప్రస్తుతం రెడ్‌కోలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. సోదాల్లో ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ స్థాయిలో ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఆంజనేయనగర్, మూసాపేట్ ప్రాంతాల్లో 10 ప్లాట్లు, నాలుగు రెసిడెన్షియల్ ప్లాట్లు, కమర్షియల్ భవనాలు, ఖానామెట్ గుట్టల బేగంపేట్‌లో 5 కమర్షియల్ భవనం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2019లో రూ.26 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ముత్యం వెంకటరమణపై అప్పటి నుంచే నిఘా కొనసాగుతోందని, విద్యుత్ శాఖలో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాల ఆధారంగా మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది.

# పేదల స్వొంతింటి కలను నెరవేరుస్తున్నాం

**సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన పొంగులేటి**

**హైదరాబాద్, జూలై 22:** పేదవాడి ఆత్మగౌరవమైన సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను ఆయన స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజల బాధలు వినడానికి ఎలాంటి అవకాశం ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 7.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. గతంలో హైదరాబాద్ వంటి నగరంలో సొంత ఇల్లు కలగానే ఉండేది. అప్పట్లో డబుల్ బెడ్ రూమ్ అంటూ మాయ మాటలు చెప్పి మోసం చేశారు. మేం హైదరాబాద్‌లో ఎకరం రూ.200 కోట్లు ఉన్నా.. ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం. నగర ప్రజలు ఇళ్ల కోసం 'మీసేవ'లో అప్లై చేసుకోవాలి. గతంలో చేసిన వారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పొంగులేటి తెలిపారు.




# పార్లమెంట్ ఎజెండాలో 'నీట్'పై చర్చ ఏది?

## అధికార పక్షానిదే వైఫల్యం!

### లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు చిన్నాభిన్నమవుతున్నా కేంద్రం నిర్లక్ష్యం

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే..పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్టీఏ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే...పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదీశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు.ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది. నీట్‌పై చర్చించి, లీకులు లేకుండా, అన్ని రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటే మంచిది.

# మూడోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

- విపక్షాల నిరసనలతో హోరెత్తిన సభ
- నల్ల చొక్కలాతో పార్లమెంట్ ముందు విపక్షాల నిరసన



**న్యూఢిల్లీ, జులై 22:** వరుసగా మూడో రోజు కూడా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టబట్టడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. బుధవారం కూడా లోక్‌సభ, రాజ్యసభలో గందరగోలం నెలకొన్నది. దీంతో రెండు సభలు 12 గంటల వరకు వాయిదా పడ్డాయి.తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. కానీ ఫలితం కనిపించలేదు. ప్రశ్నోత్తరాల సమయం జరిగే రీతిలో విపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. ఎటువంటి సమస్యపైన అయినా చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. కానీ విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా విపక్షాలు సీజేపీపై లాఠీచార్జ్ అంశాన్ని చర్చించాలని పట్టుపట్టాయి. కానీ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ వ్యతిరేకించారు. గందరగోళ నేపథ్యంలో సభను 12 వరకు వాయిదావేశారు. మరో వైపు విపక్ష ఎంపీలు ఇవాళ నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా నల్ల దుస్తులు ధరించినట్లు కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా ఆరోపించారు.

# నీట్‌పై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం: కేంద్రం

- ప్రశ్నపత్రం లీక్‌ను 'ఘోర పాపం'గా అభివర్ణించిన ప్రధాని
- ప్రతిపక్షం చర్చకు బదులు ఆందోళనల మార్గం ఎంచుకుందని కేంద్రం విమర్శ
- విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరీక్షను మళ్లీ నిర్వహించామని వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 22:** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర వర్గాలు వెల్లడించాయి. ప్రతిపక్షం చర్చ కోరితే ప్రభుత్వం ఎప్పుడూ వెనుకడుగు వేయలేదని స్పష్టం చేశాయి. ఈ అంశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తూ, నీట్ ప్రశ్నపత్రం లీక్‌ను 'ఘోర పాపం'గా అభివర్ణించినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. నీట్ లీక్ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు అంగీకరించినప్పటికీ, ప్రతిపక్షం ఆందోళనలకే ప్రాధాన్యం ఇచ్చిందని కేంద్రం విమర్శించింది. విద్యార్థుల నిరసనలకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంతో ఈ అంశం మరింత రాజకీయ రంగు పులుముకుందని పేర్కొంది. నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై పూర్తి స్థాయి చర్చ నిర్వహించాలని, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో చర్చ జరపాలని ప్రతిపక్షం పట్టుబడుతోంది. ఇదిలా ఉండగా, ఎన్‌డీఏ ఎంపీల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ అంశంపై మాట్లాడినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ప్రశ్నపత్రం లీక్ ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించి అవసరమైన చర్యలు చేపట్టిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీట్ పరీక్షను తిరిగి నిర్వహించినట్లు ప్రధాని వివరించారని తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, నీట్ వ్యవహారంపై పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది.



# విద్యార్థులపై కేసులు పెట్టొద్దు..

## కేంద్రానికి సోనమ్ వాంగ్‌చుక్ లేఖ..

**న్యూఢిల్లీ, జులై 22:** సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు బుధవారం లేఖ రాశారు. నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు పెట్టొద్దని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. విద్యార్థులపై కేసులు పెట్టబోమని కేంద్రం హామీ ఇవ్వాలని కోరారు. కేంద్రం హామీ ఇస్తే దీక్ష విరమిస్తానని స్పష్టం చేశారు. కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే తన దీక్ష కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

### ఆస్పత్రిలో కొనసాగుతున్న దీక్ష..

విద్యా వ్యవస్థలో వైఫల్యాలపై సోనమ్ వాంగ్‌చుక్ జూన్ 28వ తేదీనుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయన ఆరోగ్యం క్షీణించటంతో హైకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు కొద్దిరోజుల క్రితం జంతర్ మంతర్ వద్ద నుంచి ఆయనను బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. మొదట సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రికి మార్చారు. ఆయన అక్కడి ఐసీయూలో ఉంటూనే.. డాక్టర్ల బలవంతపు ఫీడింగ్‌ను నిరాకరిస్తూ దీక్షను కొనసాగిస్తున్నారు.

# చలో సంసద్‌పై పోలీసుల లాఠీన్యం

## అత్యవసర చర్చకు సుప్రీం తిరస్కరణ




**న్యూఢిల్లీ,జులై 22:** కాక్రోచ్ జనతాపార్టీ 'చలో సంసద్' మార్చ్‌లో భాగమైన నిరసనకారులపై పోలీసు లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే.. దాని అత్యవసర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని.. అలాగే పిటిషనర్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..'మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్ అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు కూడా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలోకి తమను లాగొద్దని వ్యాఖ్యానించింది. దాంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ లాఠీఛార్జిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంటు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. పలుచోట్ల రాళ్లు రువ్వడం, ఘర్షణ పడటం, తోపులాటలతో అటు పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. చాలా మంది రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి. వీటిని చూపుతూ విచారణ కోరారు. అయితే సుప్రీం ప్రధాన న్యాయమూర్తి వాటిని తిరస్కరించారు. అత్యవసరంగా చర్చించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

# 10 ఏళ్లలో 152 పేపర్ లీకులు: రాహుల్ గాంధీ

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్
- విద్యా వ్యవస్థ రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపణ
- విద్యార్థులకు ప్రధాని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత డిమాండ్



**న్యూఢిల్లీ, జూలై 22:** గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 152 పేపర్ లీక్ ఘటనలు వెలుగు చూశాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇన్ని ఘటనలు జరిగినప్పటికీ ఒక్క కేసులోనూ అసలు దోషులను గుర్తించి శిక్షించలేదని విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ఉద్యమిస్తున్న విద్యార్థులకు మద్దతుగా బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో దేశ విద్యా వ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించిన రాహుల్ గాంధీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా మారిందని అన్నారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు కూడా ఇదే డిమాండ్ చేస్తున్నారని, అది పూర్తిగా సమంజసమైనదేనని పేర్కొన్నారు. గత పదేళ్లలో సగటున ప్రతి వారం ఒక పేపర్ లీక్ జరిగినట్లేనని రాహుల్ గాంధీ అన్నారు. ఈ ఘటనల వల్ల కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నప్పటికీ, ఇప్పటివరకు ఏ కేసులోనూ బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ పరిస్థితిపై విద్యార్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు దేశానికి బలమైన ఆస్తిగా నిలిచిన విద్యారంగం ఎన్డీఏ పాలనలో దెబ్బతిందని రాహుల్ ఆరోపించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య భారంగా మారిందన్నారు. నీట్ పరీక్ష కోసం కోచింగ్‌కు అభ్యర్థులు ఏటా సుమారు రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇది కేంద్ర విద్యాశాఖ వార్షిక బడ్జెట్ అయిన రూ. 1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ సంపన్నులకు మాత్రమే అనుకూలంగా మారిందని, పేద విద్యార్థులకు అవకాశాలు తగ్గుతున్నాయని విమర్శించారు. ఇటీవల విద్యార్థుల నిరసనల సందర్భంగా జరిగిన లాఠీచార్జ్‌పై స్పందించిన రాహుల్ గాంధీ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన ఘటనకు ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు.

# జర్నలిస్టుల సమస్యలపై 27న "ఛలో పార్లమెంట్"

- జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా
- పోస్టర్ ఆవిష్కరించిన టీడబ్ల్యూజేఎఫ్

**హైదరాబాద్,జూలై 22:**

కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యలపై ఈ నెల 27వ తేదీన "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ హైదర్ గూడలోని న్యూస్ సర్వీస్ సిండికేట్(ఎన్ ఎస్ ఎస్) లో జరిగిన మీడియా సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు ఛలో పార్లమెంట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుతున్నందున దీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్ధరణ, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయడం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాకు చట్టబద్ధత వంటి డిమాండ్ల ను వెంటనే పరిష్క రించాలని కోరారు.ఈ డిమాండ్ల సాధనకై 27న ఢిల్లీలోని పార్లమెంట్ (జంతర్ మంతర్) వద్ద ఒక రోజు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన రైల్వే రాయితీని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్ధరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని




అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో "నేషనల్ మీడియా కమీషన్" ఏర్పాటు చేయాలని వారు కోరారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాలలో అనేకమంది రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్ జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేకపోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ స్కీం అమలుకావడంలేదని,అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా "జాతీయ పెన్షన్ పథకం" అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులు వంటి వాటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించాలని అన్నారు. అదేవిధంగా పాత్రికేయ సంఘాలకు,జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి, దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు పాల్గొంటారని, అదేవిధంగా ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. ధర్నా అనంతరం పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.మీడియా సమావేశంలో ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. పాండురంగారవు, పి. అశోక్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి కుమార్, రంగారెడ్డి జిల్లా కో-కన్వీనర్ నంబి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# టీజీఆర్ఈడీసీఓ డీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

**హైదరాబాద్, జూలై 22 :**



తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TGREDCO) డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ నివాసంలో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. మాదాపూర్‌లోని ఆయన నివాసంతో పాటు 10కి పైగా ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. డీఎస్పీ మాజి ఖాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సోదాలు ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించినవిగా తెలుస్తోంది. సోదాలు కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

# జూలై 24న గోదావరి తీరం వెంట 99 లక్షల మొక్కలు..

## గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు శ్రీకారం

**హైదరాబాద్, జూలై 22 :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో జూలై 24న బాసర నుంచి త్రయంబకేశ్వర్ వరకు గోదావరి నదికి ఇరువైపులా 99 లక్షల మొక్కలు నాటే మహా హరిత కార్యక్రమం చేపట్టనున్నారు. మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. 50 లక్షల మంది వాలంటీర్ల భాగస్వామ్యంతో గోదావరి, మంజీరా, ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత కూడా చేపట్టనున్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. 2018 నుంచి గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా 4.4 కోట్ల మంది భాగస్వామ్యంతో 19.6 కోట్ల మొక్కలు నాటినట్లు నిర్వాహకులు తెలిపారు. 3-3-3 మోడల్ స్ఫూర్తితో ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. 2031 అక్టోబర్ 15 నాటికి 100 కోట్ల మొక్కలు నాటి వాటిని సంరక్షించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని జోగినపల్లి సంతోష్ కుమార్ తెలిపారు. ఈ హరిత ఉద్యమం నేల కోత తగ్గించడం, రైతుల ఆదాయం పెంచడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

# భారతీయ సినీ నిర్మాతలకు కేంద్రం అండ..

- ఆర్థిక సహాయం, అంతర్జాతీయ అవకాశాలకు ప్రోత్సాహం

**న్యూఢిల్లీ, జూలై 22:**

భారతీయ సినీ పరిశ్రమను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ చిత్రాల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు, ప్రపంచవ్యాప్త ప్రచారానికి ప్రోత్సాహం ఇస్తోంది. డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ అండ్ డిసెమినేషన్ ఆఫ్ ఫిల్మిక్ కంటెంట్ (DCDFC) పథకం, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NFDC) ద్వారా సినీ నిర్మాతలకు మద్దతు అందిస్తోంది. భారతీయ చిత్రాలను అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలు, ఫిల్మ్ మార్కెట్లలో ప్రోత్సహించేందుకు కేంద్రం సహకరిస్తోంది. అలాగే FICCI, ICC వంటి సంస్థలతో కలిసి అంతర్జాతీయ భాగస్వామ్య అవకాశాలను కల్పిస్తోంది. విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాల ద్వారా భారతీయ సినిమాల ప్రచారం, విదేశీ సినీ పరిశ్రమలతో అనుసంధానానికి ఆర్థిక సహాయం అందిస్తోంది. WAVES బజార్, వర్క్-ఇన్-ప్రోగ్రెస్ ల్యాబ్స్, వ్యూయింగ్ రూమ్స్, అంతర్జాతీయ సహ-నిర్మాణ కార్యక్రమాల ద్వారా సినీ నిర్మాతలకు ప్రపంచ మార్కెట్‌లో అవకాశాలు కల్పిస్తోంది. సినీ రంగంలోని అవకాశాలు, సవాళ్లపై సమగ్ర అధ్యయనం చేసేందుకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఇటీవల ఉన్నత స్థాయి అధ్యయన బృందాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఆ బృందం నివేదిక ఆధారంగా తదుపరి విధాన నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డా. ఎల్. మురుగన్ లోక్‌సభలో లిఖిత పూర్వక సమాధానంలో వెల్లడించారు.

# రెవెన్యూ డివిజన్ సాధనకై 31న పట్టణ ఆలేరు పట్టణం బంద్

## బస్టాండ్ వద్ద ధర్నా: అఖిలపక్ష కమిటీ పిలుపు

**ఆలేరు, జూలై 22 :**



ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటులో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఈ నెల 31న ఆలేరు పట్టణ బంద్ నిర్వహించి, ఉదయం 10 గంటలకు స్థానిక బస్టాండ్ వద్ద భారీ ధర్నా చేపట్టాలని అఖిలపక్ష కమిటీ నిర్ణయించింది. బుధవారం స్థానిక ఆర్యవైశ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆలేరు పేరుకే అసెంబ్లీ నియోజకవర్గంగా ఉన్నప్పటికీ విద్య, వైద్యం, పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఆలేరుకు రావాల్సిన పలు ప్రభుత్వ కార్యాలయాలు, అభివృద్ధి సంస్థలు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయాయని ఆరోపించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, ఏసీపీ కార్యాలయం, ఆర్అండ్‌బీ డీఈ కార్యాలయం, మెడికల్ కళాశాల, 100 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ స్కూల్ తదితర సంస్థలు ఆలేరుకు దక్కకపోవడం అభివృద్ధికి ప్రతికూలంగా మారిందన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటే ఆలేరు అభివృద్ధికి కీలకమని పేర్కొంటూ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటికీ అధికారిక ప్రకటన వెలువడకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ నెల 31న నిర్వహించే పట్టణ బంద్, ధర్నా కార్యక్రమాలకు రాజకీయ పార్టీలకు అతీతంగా వ్యాపార, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిలపక్ష కమిటీ విజ్ఞప్తి చేసింది. సమావేశంలో కన్వీనర్ పసుపునూరి వీరేశం, కో-కన్వీనర్ రాచకొండ జనార్దన్, చెక్క వెంకటేష్, మొరిగాడి చంద్రశేఖర్, కళ్లెపు అడవయ్య, కేమిడి ఉప్పలయ్య, వార్డు కౌన్సిలర్ యాట శివ, మీడియా ప్రతినిధి కుర్షిత్ పాషా, వ్యాపార సంఘ ప్రతినిధి కృష్ణహరి, అశోక్, నమిలి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# 56 కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం



**హనుమకొండ, జూలై 22 :**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హనుమకొండ పర్యటనలో భాగంగా సుమారు రూ.56 కోట్ల వ్యయంతో విద్యుత్ శాఖకు చెందిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వాజ్‌పేయి కాలనీ, ఆర్&బీ క్వార్టర్స్, విద్యుత్ నగర్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ వద్ద నాలుగు 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపన చేయగా, డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో 33/11 కేవీ ఉపకేంద్రం, టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం 5వ అంతస్తు, నూతన సమావేశ మందిరం, హనుమకొండ నూతన సర్కిల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం టీజీఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత

- యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు
- పేపర్ లీకేజీల సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలి:ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- నిరసన దీక్ష, ర్యాలీలో పాల్గొని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.

**ఆలేరు, జూలై 22 :**



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ ఘటనలకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకత తీసుకురావాలని కోరారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పిలుపు మేరకు ఆలేరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా నిరసన దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిరసన దీక్ష అనంతరం బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో ఆలేరు బస్టాండ్ నుంచి రైల్వే గేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆలేరు పోలీసులు నిరసన కార్యక్రమాన్ని చెల్లాచెదురు చేసి విరమింపజేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. దేశంలో విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. నీట్ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షలో పేపర్ లీకేజీ చోటుచేసుకోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. విద్యార్థులు నెలల తరబడి కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుంటే, కొందరి అక్రమాల వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం బాధాకరమన్నారు. పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి అసలు సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పటిష్ఠమైన భద్రతా వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టిన నిరసనలను అడ్డుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని బీర్ల ఐలయ్య అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి నిరసన తెలిపే హక్కు కల్పించిందని, ఆ హక్కులను కాలరాసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ సంస్థల్లో డిజిటల్ పరివర్తనకు కేంద్రం వేగం

**న్యూఢిల్లీ, జూలై 22 :**

పంచాయతీరాజ్ సంస్థల్లో పారదర్శకత, సామర్థ్యం, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ★ఈ-పంచాయత్ మిషన్ మోడ్ ప్రాజెక్టు (e-Panchayat MMP)★ను రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (RGSA) కింద అమలు చేస్తోంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో eGramSwaraj మరియు AuditOnline డిజిటల్ వేదికలను అమలు చేస్తున్నారు. eGramSwaraj ద్వారా ప్రణాళికలు, బడ్జెట్, ఖాతాల నిర్వహణ, పనుల పురోగతి, ఆస్తుల నిర్వహణ చేపడుతుండగా, AuditOnline ద్వారా పంచాయతీ ఖాతాల ఆన్‌లైన్ ఆడిట్ నిర్వహించి పారదర్శక పాలనకు తోడ్పడుతోంది.

# అశ్లీల కంటెంట్‌పై కేంద్రం కఠిన చర్యలు..

## రెండేళ్లలో 50 ఓటీటీ వేదికలు నిలిపివేత

**న్యూఢిల్లీ, జూలై 22 :**

: అశ్లీల కంటెంట్ ప్రసారం చేయడం, సమాచార సాంకేతిక (ఐటీ) చట్టం-2000తో పాటు ఇతర చట్టాలను ఉల్లంఘించినందుకు గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా 50 ఓటీటీ (OTT) వేదికల ప్రజా ప్రాప్యతను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఈ విషయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. డిజిటల్ మీడియా, ఓటీటీ వేదికల కోసం 2021 ఐటీ (ఇంటర్మీడియరీ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నిబంధనలు అమల్లో ఉన్నాయని, వీటి కింద ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 67, 67ఏ, భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 294, అలాగే మహిళల అసభ్యకర ప్రతినిధిత్వ నిషేధ చట్టం, 1986లోని నిబంధనల ఉల్లంఘనల ఆధారంగా ఈ చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు.

## రైల్ వన్ యాప్ కు విశేష ఆదరణ.. 4.55 కోట్ల డౌన్ లోడ్ లు

**న్యూఢిల్లీ, జూలై 22::**

భారతీయ రైల్వే అభివృద్ధి చేసిన రైల్‌వన్ యాప్‌కు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు యాప్‌ను 4.55 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకోగా, రోజుకు సగటున 9.65 లక్షల టికెట్లు ఈ యాప్ ద్వారా బుక్ అవుతున్నాయి. అలాగే రైల్వే టికెట్ బుకింగ్‌లో మోసాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టిన రైల్వే శాఖ, 2024 జనవరి నుంచి అసాధారణ మొబైల్ నంబర్లు, ఈ-మెయిల్ డొమైన్లు, ఐపీ అడ్రస్‌లతో ఉన్న 6.68 కోట్లకు పైగా యూజర్ ఖాతాలను నిలిపివేసింది. 2025-26, 2026-27 (జూన్ 30 వరకు) కాలంలో 530 అనుమానాస్పద బుకింగ్ ఫిర్యాదులు జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదు చేయగా, 13,343 అనుమానాస్పద ఈ-మెయిల్ డొమైన్లను బ్లాక్ చేసింది. 2025 జూన్ నుంచి 2026 జూన్ వరకు బుక్ అయిన 65.08 కోట్ల రిజర్వేషన్ టికెట్లలో 89 శాతం ఆన్‌లైన్ ద్వారా, మిగిలిన 11 శాతం కౌంటర్ల ద్వారా బుక్ అయ్యాయని రైల్వే శాఖ వెల్లడించింది.

## విక్రమ్-1 ప్రయోగంలో నిజామాబాద్ ముద్దుబిడ్డ సత్తా!

### కోటగిరి నుంచి అంతరిక్ష సాంకేతికత వరకు.. అఖిల్ అరుదైన మైలురాయి

**కోటగిరి, జూన్ 22,(సమయం న్యూస్ ) :-**




భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ రాకెట్ ★'విక్రమ్-1'★ చారిత్రాత్మక విజయంలో నిజామాబాద్ జిల్లా, కోటగిరి మండలానికి చెందిన యువ ఇంజనీర్ ★మహాజన్ అఖిల్★ అత్యంత కీలక పాత్ర పోషించారు. పవర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో M.Tech పూర్తి చేసిన అఖిల్, గతంలో ఆరు సంవత్సరాల పాటు ప్రతిష్ఠాత్మక ★DRDOలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా సేవలందించి ఎంతో అనుభవం గడించారు. ఆ రక్షణ రంగ అనుభవంతో ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న దేశపు తొలి ప్రైవేట్ స్పేస్ సంస్థ ★'స్కైరూట్ ఏరోస్పేస్'★★ సాంకేతిక బృందంలో చేరి, విక్రమ్-1 రాకెట్ రూపకల్పన, సాంకేతిక వ్యవస్థల నిర్మాణంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి సునాయాసంగా పంపేందుకు రూపొందించిన విక్రమ్-1 ప్రయోగం విజయవంతం కావడంతో భారత అంతరిక్ష రంగానికి కొత్త ఊపిరి వచ్చింది. గ్రామీణ ప్రాంతం నుంచి ప్రస్థానం ప్రారంభించి జాతీయ స్థాయిలో రక్షణ, అంతరిక్ష రంగాల్లో సత్తా చాటిన అఖిల్ విజయం జిల్లా యువతకు గొప్ప స్ఫూర్తిగా నిలిచింది. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన అఖిల్‌ను, ఆయన కుటుంబ సభ్యులను స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు మళ్లాలి: మంత్రి తుమ్మల



**ఖమ్మం, జూలై 22 :**

సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వరి, మిర్చికి బదులుగా ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వచ్చే జూన్ వరకు తాగునీటి అవసరాలకు సరిపడా కార్యాచరణ సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ దివాకర టీవీఎస్ తెలిపారు. రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం కొనసాగుతోందని మంత్రి చెప్పారు. అనంతరం రూ.1.75 కోట్లతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

## తాటికొండలో ఘనంగా 100వ "ఆయిల్ పామ్ ముచ్చట్లు"



**మహబూబ్ నగర్, జూలై 22::**

భూత్పూర్ మండలం తాటికొండ రైతు వేదికలో ప్రి-యూనిక్ ఆయిల్ పామ్ కంపెనీ ఆధ్వర్యంలో 100వ "ఆయిల్ పామ్ ముచ్చట్లు" కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో 5,000 ఎకరాల సాగు లక్ష్యంలో ఇప్పటికే 4,800 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు పూర్తయిందని, 2026-27లో 1,500 ఎకరాల లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు డబుల్ ల్యాటరల్ డ్రిప్, మెటల్డెహైడ్ చిటెల్, కస్టమ్ హైరింగ్ సెంటర్లు, సోలార్ ఫెన్సింగ్ కల్పించాలని కోరగా, వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# ప్రధాని మోదీ, విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

### మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూలై 22 :**



నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార-పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి వారం ఒక మంత్రి ప్రజలతో నేరుగా సమావేశమై సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు కలిపి మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని, గతంలో దరఖాస్తు చేసినవారు కూడా మీ సేవ, వాట్సాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నీట్ పరీక్ష లీక్‌పై నిరసన తెలిపిన విద్యార్థులు, కాంగ్రెస్ నేతలపై లాఠీచార్జ్ చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. 22 లక్షల మంది నీట్ అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

# ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర నిపుణుల కమిటీ తొలి సమావేశం






**హైదరాబాద్, జూలై 22:**

ఎల్‌నినో ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి వ్యవసాయం, అనుబంధ రంగాలకు రాష్ట్ర స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 మంది సభ్యుల నిపుణుల కమిటీ తొలి సమావేశం ప్రజాభవన్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 30 శాతం వర్షపాతం లోటు నమోదైందని, 23 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఎల్‌నినో కారణంగా నైరుతి రుతుపవనాలు బలహీనపడి వర్షాలు తగ్గుతున్నాయని వివరించారు. జిల్లా, మండలాల వారీగా వర్షపాతం, పంటల వివరాలను సేకరించి శాస్త్రీయ విశ్లేషణ ఆధారంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. సమావేశంలో వాతావరణ అంచనాలు, పంటల వైవిధ్యీకరణ, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల ప్రోత్సాహం, నీటి సంరక్షణ, భూగర్భజలాల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, జలాశయాల నిర్వహణ, విద్యుత్ వినియోగం, సౌరశక్తి వినియోగం, అడవుల సంరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఐఎండీ శాస్త్రవేత్త డా. స్టెల్లా మాట్లాడుతూ రానున్న నెలల్లో ఎల్‌నినో మరింత బలపడే అవకాశం ఉందని, మిగిలిన నైరుతి రుతుపవన కాలంలో తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ జిల్లా వారీగా రైతులకు ప్రత్యేక సూచనలు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# అరుదైన వ్యాధితో చిన్నారి శౌర్య పోరాటం

- వైద్య చికిత్సకు జూకంటి బాబు ఆర్థిక సాయం: దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి

**ఆలేరు, జూలై 22 :**



ఆలేరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన బాణాల అరుణ్ కుమార్తె బాణాల శౌర్య గత కొంతకాలంగా అత్యంత అరుదైన మాలిగ్నెంట్ ఇన్‌ఫాంటైల్ ఆస్టియోపెట్రోసిస్ అనే వ్యాధితో బాధపడుతోంది. ఈ వ్యాధికి ప్రత్యేక వైద్య చికిత్స అవసరం కాగా, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతుందరా. చిన్నారి పరిస్థితిని తెలుసుకున్న సామాజిక సేవకుడు జూకంటి బాబు స్పందించి, తన వంతు బాధ్యతగా వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆమె చికిత్సకు మరింత మంది దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆయన కోరారు. వైద్యుల సూచనల మేరకు చిన్నారికి దీర్ఘకాలిక చికిత్స అవసరమని, అందుకు అధిక వ్యయం అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే చికిత్స కోసం భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చిందని, ప్రస్తుతం కూడా ఆర్థిక సహాయం అత్యవసరంగా అవసరమని తెలిపారు ఈ నేపథ్యంలో దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ తమకు తోచిన మేర ఆర్థిక సహాయం అందించి చిన్నారి శౌర్యకు మెరుగైన వైద్యం అందేలా చేయూతనివ్వాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. చిన్నారి ఆరోగ్యం మెరుగుపడి సాధారణ జీవితాన్ని గడపాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా శుక్రవారం భారీ అన్నదానం

- బిఆర్ఎస్ మండల నాయకుడు తెల్ల రవికుమార్ వెల్లడి
- మండల కేంద్రంలో ఘనంగా వేడుకల నిర్వహణకు పిలుపు

**కోటగిరి, జూన్ 22:**



కోటగిరి మండల కేంద్రంలో బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్క రించుకొని ఈనెల శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బిఆర్ఎస్ మండల నాయకుడు తెల్ల రవికుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీతో వేడుకలు ప్రారంభమవుతాయని, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహి స్తామని పేర్కొన్నారు. కోటగిరి మండల పరిధిలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు ముందుగా తమ గ్రామాల్లో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి, కేక్ కటింగ్ అనంతరం మండల కేంద్రానికి చేరుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు వల్లేపల్లి శ్రీని వాసరావు, మోరే కిషన్, శంకర్ గౌడ్, కప్ప సంతోష్, నజీర్, అరవింద్, జలాల్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన

- శ్రీనివాసపురం, పటేల్‌గూడెంలో గ్రామసభలు: వివాదరహిత హద్దులే లక్ష్యమని తహసీల్దార్

**ఆలేరు, జూలై 22 :**



తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న భూముల రీ సర్వే ప్రక్రియపై రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించేందుకు ఆలేరు మండలంలోని శ్రీనివాసపురం, పటేల్‌గూడెం గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు రీ సర్వే విధానం, దాని లక్ష్యాలను వివరించారు. భూముల రీ సర్వే ద్వారా వివాదరహితంగా భూ హద్దులను ఖరారు చేయడంతో పాటు, వాటిని డిజిటలైజేషన్ చేయడం ప్రధాన ఉద్దేశమని తహసీల్దార్ తెలిపారు. భూ యజమానులు సర్వే సమయంలో పూర్తి సహకారం అందించాలని, సంబంధిత పత్రాలతో హాజరై భూ హద్దులను సరిచూసుకోవాలని సూచించారు. రీ సర్వే పూర్తయితే భూ వివాదాలు తగ్గడంతో పాటు భవిష్యత్తులో భూముల లావాదేవీలు మరింత పారదర్శకంగా జరుగుతాయని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను ముందుగానే పరిశీలించు కోవాలని, సర్వే బృందానికి అవసరమైన సమాచారం అందించాలని అధికారులు కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. గ్రామసభల్లో శ్రీనివాసపురం సర్పంచ్ శోభన్‌బాబు, పటేల్‌గూడెం సర్పంచ్ గ్యార కుమారస్వామి, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, మండల సర్వేయర్ రోషన్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణచంద్రరావు, ఇరిగేషన్ ఏఈ శివాని, జీపీఓ జంగిర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఇతర శాఖల అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎల్ఐపీ నుంచి ఎన్ఎస్పీకి నీటి సరఫరా..

### 1.81 లక్షల ఎకరాలకు సాగునీరు

**హైదరాబాద్, జూలై 22:**



సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (SRLIP) నుంచి 1,600 క్యూసెక్కుల నీటిని రాజీవ్ లింక్ కాలువ ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టు (NSP) ఎడమ కాలువలోకి, కి.మీ. 52.299 వద్ద ఉన్న రెగ్యులేటర్ ఎగువ భాగంలోకి విడుదల చేయనున్నారు. దీంతో మొత్తం 1,81,049 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఈ నీటితో కి.మీ. 14.03–52.299 మధ్య 80,082 ఎకరాల NSP ఆయకట్టు, వైరా ప్రాజెక్టు కింద 17,390 ఎకరాలు, లంకాసాగర్ కింద 7,250 ఎకరాలు, అలాగే కి.మీ. 52.299 తర్వాత 76,327 ఎకరాల NSP ఆయకట్టు ప్రయోజనం పొందుతుంది. అలాగే, కి.మీ. 52.299 వద్ద రెగ్యులేటర్ నిర్వహణ ద్వారా కాలువలో నీటి మట్టం పెంచి వెంకటాయపాలెం డీప్‌కట్ ప్రాంతం వరకు బ్యాక్‌వాటర్‌ను తీసుకురానున్నారు. అక్కడి నుంచి మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా రఘునాథపాలెం మండలంలోని చెరువులు, ఆయకట్టుకు నీరు అందించడంతో పాటు మిగులు నీటిని మున్నేరు నదిలోకి విడుదల చేసి ఖమ్మం నగర తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు. అదేవిధంగా కొడుమూరు–వందనం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా చింతకాని మండలంలోని చెరువులు నింపి ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం కలుగుతుంది.

# ఓటరు జాబితా డిజిటలైజేషన్ 97.90 శాతం పూర్తి

- **మిగిలిన ఓటర్లు ఆగస్టు 3లోగా బీఎల్ఓలను సంప్రదించాలి: అదనపు కలెక్టర్ వెంకారెడ్డి**

**ఆలేరు, జూలై 22 :**



ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఆలేరు నియోజకవర్గంలో ఓటరు వివరాల డిజిటలైజేషన్ 97.90 శాతం పూర్తైందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ–97) వెంకారెడ్డి తెలిపారు. బుధవారం ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంకా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయని అర్హులైన ఓటర్లు ఉంటే సంబంధిత బీఎల్ఓలను ఆగస్టు 3లోగా తప్పనిసరిగా సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. మరణించిన ఓటర్ల వివరాలను కుటుంబ సభ్యులు లేదా సంబంధిత వ్యక్తులు స్వచ్ఛందంగా ఎన్నికల అధికారులకు తెలియజేయాలని, అవసరమైన వివరాలను సమర్పించడం ద్వారా ఓటరు జాబితాను కచ్చితత్వంతో రూపొందించేందుకు సహకరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదైందో లేదో పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, ఎన్నికల ఉప తహసీల్దార్ రాందాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు చెక్క వెంకటేష్, కూళ్ల నరసింహ, కామిటికారి కృష్ణ, మహేందర్‌రెడ్డి, కుండే సంపత్ రాజు, నరసయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1 నుంచి నీటి సంరక్షణ పనులు ప్రారంభించాలి:




### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, జూలై 22 :**

సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ జలసిరి, వీబీజీ రామ్ జీ (VBGRAMG) పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఆగస్టు 1 నుంచి పంట కుంటలు, ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, బోరు రీఛార్జ్ నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా మిషన్ మోడ్‌లో పనిచేయాలని, నాణ్యతతో పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, డీఆర్డీవో కాళిందిని, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# జీరో యాక్సిడెంట్ జోన్‌గా మెదక్‌కు ప్రత్యేక కార్యాచరణ

### కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, జూలై 22 :**




మెదక్ జిల్లాను జీరో యాక్సిడెంట్ జోన్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బ్లాక్‌స్పాట్ల గుర్తింపు, సీసీ కెమెరాలు, లైటింగ్, బారికేడ్లు, రేడియం స్టిక్కర్లు, స్పీడ్ నియంత్రణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. పాఠశాలల సమీపంలో IRC నిబంధనల ప్రకారం వేగ నియంత్రికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా హైవేలపై పార్కింగ్, ఆక్రమణలు, అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వడియారం, రామాయంపేట జంక్షన్లలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని సూచిస్తూ, ప్రజల ప్రాణ రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, ఆర్&బీ, నేషనల్ హైవే, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉట్నూర్‌లో 'వజ్రం ప్యూర్ ఫైర్' శుద్ధ జల కేంద్రం ప్రారంభం





**ఆదిలాబాద్, జూలై 22 :**

ఉట్నూర్ మండలం శాంతినగర్‌లో నంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వజ్రం ప్యూర్ ఫైర్' శుద్ధ జల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో ఇలాంటి శుద్ధ జల కేంద్రాలు కీలకమని అన్నారు. ఐయోనైజేషన్ సాంకేతికతతో నీటిని శుద్ధి చేసి స్మార్ట్ కార్డుల ద్వారా 20 లీటర్ల క్యాన్లలో ప్రజలకు అందిస్తామని తెలిపారు. ప్లాంట్ నుంచి వచ్చే వ్యర్థ నీటిని ప్రభుత్వ వసతి గృహాల వినియోగానికి మళ్లించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు మేలు చేశాయని, అయితే వర్షాల అనంతరం డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, శుద్ధ జల కేంద్రాన్ని దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా స్థానికులు, అధికారులు సమష్టిగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఋత్విక్ సాయి కోటే, ఎంపీడీఓ రాయిస్ ఉద్దీన్, నంది ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెదక్ టూరిజం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక: కలెక్టర్




**మెదక్, జూలై 22::**

మెదక్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. నర్సాపూర్ అర్బన్ పార్క్, మెదక్ ఖిల్లా, పోచారం, పాపన్నపేట కోట తదితర ప్రాంతాలపై పర్యాటక కన్సల్టెంట్లు సమర్పించిన నివేదికను సమీక్షించిన కలెక్టర్, వారసత్వ, ఆధ్యాత్మిక, పర్యావరణ పర్యాటకంగా విభజించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. మెదక్‌ను టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# జడ్చర్లలో ఎస్ఐఆర్ పురోగతిపై రాజకీయ పార్టీలతో సమీక్ష




**మహబూబ్‌నగర్, జూలై 22:**

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై జడ్చర్ల శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 75–జడ్చర్ల నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ 83.74 శాతం పూర్తైందని, మిగిలిన ప్రక్రియను ఆగస్టు 3లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, అదనపు తహసీల్దార్, డీటీలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# హెటెరోతో ఇంటర్ విద్యాశాఖ అవగాహన ఒప్పందం..

### 300కుపైగా ఉద్యోగ అవకాశాలు




**హైదరాబాద్, జూలై 22 :**

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హెటెరో ఫార్మాస్యూటికల్స్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో పరిశ్రమల అనుసంధానం, క్యాంపస్ నియామకాలు, నైపుణ్య శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, అధ్యాపకులకు పరిశ్రమల పరిచయం, సీఎస్ఆర్ కింద ప్రయోగశాలల అభివృద్ధి వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ముఖ్యంగా లైఫ్ సైన్సెస్, వృత్తి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. హెటెరో సంస్థ ద్వారా ఇంటర్మీడియట్ అర్హత కలిగిన యువతకు 300కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. డైరెక్టర్ అభిలాష అభినవ్ ఈ ఒప్పందం విద్యార్థులకు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు అందించడంలో కీలకమని పేర్కొన్నారు.

# పిల్లలు, యువతకు ఆరోగ్యకర ఆహారంపై ఐసీఎంఆర్ కొత్త విధాన సిఫార్సులు

**న్యూఢిల్లీ, జూలై 22 :**

పిల్లలు, యువతలో ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను ప్రోత్సహించేందుకు ఐసీఎంఆర్–జాతీయ పోషకాహార సంస్థ (ICMR–NIN) ఆధ్వర్యంలోని "లెట్స్ ఫిక్స్ అవర్ ఫుడ్" కన్సార్టియం కొత్త విధాన సిఫార్సులను విడుదల చేసింది. పాఠశాలల్లో ఆరోగ్యకర ఆహార వాతావరణం, ఆహార లేబుళ్లపై అవగాహన, పిల్లలను లక్ష్యంగా చేసుకున్న జంక్‌ఫుడ్ ప్రకటనల నియంత్రణ, అధిక కొవ్వు–ఉప్పు–చక్కెర (HFSS) ఆహారాలపై పన్ను, ఉప్పు వినియోగం తగ్గింపు, పోషకాహార విద్య వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చింది. ఈ విధాన పత్రాన్ని నీతి ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్యం) డా. ఎం. శ్రీనివాస్ న్యూఢిల్లీలో విడుదల చేశారు. దేశంలో ఊబకాయం, ఆహార సంబంధిత అసాంక్రమిక వ్యాధులను తగ్గించేందుకు ఈ సిఫార్సులు దోహదపడతాయని నిపుణులు తెలిపారు.

# ప్రభుత్వ భవనాల నిర్మాణాలు నాణ్యతతో, గడువులో పూర్తి చేయాలి: కలెక్టర్



**జగిత్యాల, జూలై 22::**

ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేట, లక్ష్మీపూర్ గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనం, అదనపు తరగతి గదులు, పల్లె దవాఖాన, వీవో భవనాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని మౌలిక సదుపాయాలతో పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ప్రతి ప్రభుత్వ భవనం దీర్ఘకాలం ఉపయోగపడే విధంగా నిర్మించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## 60 రోజుల్లో రోడ్డు భద్రత చర్యలు పూర్తి చేయాలి: కలెక్టర్



**జగిత్యాల, జూలై 22:**

సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలను 60 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రమాదకర బ్లాక్‌స్పాట్లలో ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు జాతీయ రహదారులపై ఆక్రమణలు తొలగించి, సీసీ కెమెరాలు, స్పీడ్ డిటెక్టర్లు, ఎమర్జెన్సీ కాల్ బాక్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి 15 రోజులకు రవాణా, పోలీసు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

## తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి: అదనపు కలెక్టర్



**జగిత్యాల, జూలై 22 :**

జగిత్యాల మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణంలో పరిశుభ్రత మెరుగుపర్చడం, చెత్తను సకాలంలో సేకరించడం, డ్రైనేజీలను శుభ్రపరచడం, వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల నివారణకు యాంటీ లార్వా, ఫాగింగ్ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, ప్రజారోగ్య పరిరక్షణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

## 24న తెలంగాణ భవన్‌లో 'తెలంగాణ కేసరి' కుస్తీ పోటీలు



**హైదరాబాద్, జూలై 22::**

ఈ నెల 24న తెలంగాణ భవన్‌లో 'తెలంగాణ కేసరి' కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ పోటీలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి రెజ్లర్లకు ట్రాక్‌సూట్లు, షూస్, రవాణా ఖర్చులు అందించడంతో పాటు 70 అఖాడాలకు ప్రాక్టీస్ మ్యాట్లు అందజేస్తామని వెల్లడించారు. తెలంగాణలో రెజ్లింగ్ క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

## ఏకలవ్య పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 22::**

జిల్లాలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఆరోగ్య సేవలు, డిజిటల్ సదుపాయాలు, తాగునీరు, క్రీడా మైదానాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో సికిల్ సెల్, వార్షిక ఆరోగ్య, కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆర్‌ఓ వాటర్ కూలర్లు, హైస్పీడ్ ఇంటర్నెట్, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, నాణ్యమైన పోషకాహారం, అవసరమైన చోట చపాతీ మేకింగ్ యంత్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# బల్కంపేట్ అమ్మవారి రథోత్సవం వైభవంగా







**హైదరాబాద్, జూలై 22 :**

ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మవారి రథోత్సవం బుధవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. స్థానిక ప్రముఖులతో కలిసి ఎమ్మెల్యే దానం నాగేందర్/శ్రీనివాస్ యాదవ్ (మీ సమాచారం ప్రకారం) ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. వర్షం కురుస్తున్నప్పటికీ భారీ సంఖ్యలో భక్తులు రథయాత్రలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళల కోలాటాలు, బంజారా నృత్యాలు, గుస్సాడీ నృత్యాలు, శివశక్తుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేవాదాయ శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో రథయాత్ర ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసింది. దేవాలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర పలు ప్రాంతాల మీదుగా సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, దేవస్థానం చైర్మన్ సాయిబాబా, ఈఓ వినోద్ రెడ్డి, పోలీసు అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమ చట్టాల అమలుపై కలెక్టర్ ఆదేశాలు

**కరీంనగర్, జూలై 22::**




జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు, మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. వృద్ధుల మెయింటెనెన్స్ కేసులను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించాలని, మండల స్థాయిలో సీడీపీఓ, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీసులతో కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఆర్డీవో ఉత్తర్వుల మేరకు తల్లిదండ్రులకు మెయింటెనెన్స్ చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశించారు. సమస్యలు పరిష్కారం కాని కేసులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు పంపించాలని, ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రుల మెయింటెనెన్స్ విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, జూలై 22::**

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్, కరీంనగర్–జగిత్యాల ఫోర్‌లేన్ రహదారి, మానేరు రివర్ ఫ్రంట్ తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్ సహా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భూసేకరణ, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. కోర్టు కేసుల పరిష్కారం, పెండింగ్ సర్వేలను వేగవంతం చేసి రైతులకు సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



# అర్చకుల సంక్షేమానికి కమిటీ భరోసా..

### డీడీఎన్ భత్యం పెంపు సహా డిమాండ్లపై సీఎంకు నివేదిక

**హైదరాబాద్, జూలై 22 :**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (జీవో 679) రాష్ట్రవ్యాప్తంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అర్చకులు, గిరిజన అర్చకుల ప్రతినిధులతో అమరదీపం వద్ద ముఖాముఖి సమావేశం నిర్వహించింది. కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ వినతిపత్రాలను స్వీకరించారు.



సమావేశంలో అర్చక సంఘాల ప్రతినిధులు ధూపదీప నైవేద్యం (డీడీఎన్) భత్యం పెంపు, అర్చకుల పిల్లలకు ఉచిత వేద, సాధారణ విద్య, నిరుపేద అర్చక కుటుంబాలకు 250 గజాల నివాస స్థలం, ఉచిత రిజిస్ట్రేషన్, ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డుల మంజూరు వంటి ప్రధాన డిమాండ్లను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తెలంగాణ ఉద్యమంలో అర్చకులు, గిరిజన అర్చకులు ఆధ్యాత్మిక చైతన్యాన్ని కల్పిస్తూ పోషించిన పాత్రను అభినందించారు. అర్చకుల డిమాండ్లు న్యాయమైనవేనని పేర్కొంటూ, అన్ని విజ్ఞప్తులను నమోదు చేసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఉట్నూర్‌లో కలెక్టర్ రాజర్షిషా విస్తృత పర్యటన..

### ఇందిరమ్మ ఇళ్లు, హాస్టల్, జలసిరి పనుల పరిశీలన

**ఆదిలాబాద్, జూలై 22:**

జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం ఉట్నూర్ మండలంలోని పెద్ద సుద్దగూడ, గంగాపూర్ గ్రామాలు, మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. పెద్ద సుద్దగూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించి, నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థినులతో మాట్లాడి భోజనం, వసతి, విద్యా సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. ఎవరెస్టు శిఖరారోహణకు బయలుదేరిన పర్వతారోహకులు మాడవి కన్నీబాయి, కాట్లే ఆనందరావులను జెండా ఊపి సాగనంపిన కలెక్టర్, గంగాపూర్‌లో "తెలంగాణ జలసిరి" కింద నీటికుంటల నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ పాఠశాలలో "పోషకాహార తోట"ను ప్రారంభించి మొక్క నాటారు. ఈ సందర్భంగా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు నీటికుంటల నిర్మాణం ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.



# బల్కంపేట ఎల్లమ్మ రథోత్సవం ఘనంగా నిర్వహణ: తలసాని

**హైదరాబాద్, జూలై 22 :**

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, రథోత్సవం అందరి సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం రథోత్సవాన్ని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించిన ఆయన, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన లక్షలాది మంది భక్తుల సమక్షంలో ఉత్సవాలు విజయవంతంగా జరిగాయని తెలిపారు. ఆలయ పరిసర ప్రజలు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పక్షాల సహకారం ఇందుకు కారణమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈఓ వినోద్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల, కళాశాల బస్సులపై కాజీపేట ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**వరంగల్, జూలై 22 :**




వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అదనపు డీసీపీ (ట్రాఫిక్) రాయల ప్రభాకర్ రావు, ఏసీపీ (ట్రాఫిక్) టి. సత్య నారాయణ ఆదేశాల మేరకు కాజీపేట ట్రాఫిక్ పోలీసులు ఆదాలత్ సెంటర్ వద్ద పాఠశాల, కళాశాల బస్సులపై ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 28 స్కూల్, కాలేజ్ బస్సులను పరిశీలించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రమాదాల నివారణ కోసం ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టినట్లు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసులు సూచించారు.




# భూపాలపల్లి జిల్లా ఆసుపత్రిని 200 పడకలకు విస్తరించేందుకు ప్రతిపాదనలు

**భూపాలపల్లి, జూలై 22:**

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా ప్రధాన ఆసుపత్రికి అవసరమైన ఆధునిక పరికరాలు, సిబ్బంది భర్తీకి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, ఆసుపత్రిని 100 నుంచి 200 పడకలకు విస్తరించే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో అనస్థీషియా, గైనకాలజీ తదితర విభాగాల్లో వైద్యులు, సిబ్బంది కొరతపై సమీక్షించిన ఎమ్మెల్యే, బ్లడ్ బ్యాంక్, సెంట్రల్ ఆక్సిజన్, అత్యవసర సేవలు, పరికరాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బ్లడ్ బ్యాంక్ 24 గంటలు పనిచేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అంబులెన్సుల మరమ్మతులు, అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, ఎంఆర్ఐ టెక్నీషియన్ నియామకం, యూడీఐడీ గది ఏర్పాటు, అవసరమైన వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వైద్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులే పేద విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శులు

**జనగామ, జూలై 22 :**

ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి విద్యార్థిని విద్యావంతుడిగా, బాధ్యతగల పౌరుడిగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉపాధ్యాయులకు సూచించారు. నెల్లూట్ల హైస్కూల్‌లో నిర్వహించిన సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత ఉండాలని అన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రపంచ పటం, భారతదేశ భౌతిక–రాజకీయ పటాలు, రాజ్యాంగ ఉపోద్ఘాతం, ముఖ్యమైన ఆర్టికల్స్ ప్రదర్శించాలని ఆదేశించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి గణిత అంశాలను సులభంగా వివరించి, ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రోత్సహించారు.



# ఆగస్టు 3 వరకు ఓటర్ల జాబితా సర్వే గడువు పొడిగింపు

**సూర్యాపేట, జూలై 22 :**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, తప్పుల్లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బీఎల్ఓల ఇంటింటి సర్వే గడువును జూలై 24 నుంచి ఆగస్టు 3 వరకు పొడిగించినట్లు తెలిపారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ 100 శాతం పూర్తికాగా, డిజిటలైజేషన్ 87.55 శాతానికి చేరిందన్నారు. ఒకే వ్యక్తికి రెండు ఓట్లు, మరణించిన వారి పేర్లు జాబితాలో ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2026 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి ప్రక్రియకు సహకరించాలని కోరారు.

# శీర్షిక: ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం అవసరం:

## కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, జూలై 22 :**

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీఎల్‌వోలు సేకరించిన వివరాల ఆధారంగా ఓటరు జాబితాను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా వివరాలు సమర్పించని ఓటర్లు వెంటనే బీఎల్‌వోలు లేదా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో జాబితాలను పరిశీలించి, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, ద్వంద్వ ఓటర్లు వంటి వివరాలను గుర్తించి తెలియజేయాలని కోరారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌డెస్క్‌లు, టోల్‌ఫ్రీ నంబర్ లేదా




ఎన్నికల విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ఎలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలు, సలహాలు అందజేశారు.

# ఆరు నెలల్లో సి&డి వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ పూర్తి చేయాలి



## జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

**వరంగల్, జూలై 22 :**

గ్రేటర్ వరంగల్‌లో రూ.150 టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న కన్స్ట్రక్షన్ అండ్ డెమోలిషన్ (సి&డి) వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఆరు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. పైడిపల్లి డంప్‌యార్డులో 7 ఎకరాల్లో ఏర్పాటయ్యే ఈ ప్లాంట్ తెలంగాణలోనే తొలిసారిగా 15 పట్టణ స్థానిక సంస్థలకు క్లస్టర్ విధానంలో సేవలందించనుంది. నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి పేవర్ బ్లాక్స్, ఇంటర్‌లాకింగ్ టైల్స్, కర్బ్ స్టోన్స్, అగ్రిగేట్లు వంటి నిర్మాణ సామగ్రిగా పునర్వినియోగం చేయనున్నట్లు తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుతో డంప్‌యార్డులకు చేరే వ్యర్థాలు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, నగర పరిశుభ్రత, సర్క్యులర్ ఎకానమీకి ఊతం లభిస్తుందని కమిషనర్ పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన సాంకేతిక సెమినార్‌లో ఎస్ఎస్ఆర్ కన్సల్టెంట్స్ ప్లాంట్ రూపకల్పన, నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

# తెలంగాణలో రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చ

**హైదరాబాద్, జూలై 22 :**

: దక్షిణ మధ్య రైల్వే (SCR) జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐఏఎస్‌ను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ రైల్వే అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతి, సమన్వయ అంశాలపై ఇద్దరూ చర్చించారు.



# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోండి




**నిజామాబాద్, జూలై 22 :**

సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) నిజామాబాద్ ఆధ్వర్యంలో గిర్‌రాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డీఎస్పీ ఎం. సోమనాథం విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండి విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ ఒక్కసారి వినియోగించినా వ్యసనానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. రామ్ మోహన్ రెడ్డి విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి రాయబారులుగా మారాలని పిలుపునిచ్చారు. సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శివచరణ్ రెడ్డి, ఈగల్ ఫోర్స్ ఎస్ఐ సందీప్ డ్రగ్స్ దుష్ప్రభావాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. జానపద కళారూపం ద్వారా నషా ముక్త్ భారత్ సందేశాన్ని ప్రదర్శించగా, 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం: కలెక్టర్




**సంగారెడ్డి, జూలై 22 :**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా పీసీఆర్, పీఓఏ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. 2022 నుంచి నమోదైన 144 కేసుల్లో రూ.1.74 కోట్లు మంజూరు కాగా, 37 మంది బాధితులకు రూ.68.87 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. 2026 జూన్ వరకు 31 కేసులు నమోదవగా, 19 కేసుల్లో చార్జిషీట్లు దాఖలైనట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు.

# నల్లాలకు అక్రమంగా బిగించిన 4 మోటార్లు స్వాధీనం



**హైదరాబాద్, జూలై 22 :**

కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని శ్రీరాంనగర్ పద్మనగర్ వార్డులో జలమండలి విజిలెన్స్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో తాగునీటి పైపులైన్లకు అక్రమంగా అనుసంధానించిన 4 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడిన వారిపై జలమండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని మోటార్లను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. రెండోసారి అదే ఉల్లంఘనకు పాల్పడితే రూ.5 వేల జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నీటి ఒత్తిడి తక్కువగా ఉండడం లేదా సరఫరాలో సమస్యలు ఉంటే అక్రమ మోటార్లు వినియోగించకుండా సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎంను సంప్రదించాలని, లేదా జలమండలి కస్టమర్ కేర్ 155313కు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు.

# తెలంగాణలో ఆర్‌పీఐ బలోపేతమే లక్ష్యం: పశులా రవికుమార్



**హైదరాబాద్, జూలై 22 :**

తెలంగాణలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే)ని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు పశులా రవికుమార్ తెలిపారు. జిల్లా, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ విస్తరణతో పాటు ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపడతామని చెప్పారు. పార్టీ పేరుతో అనధికారికంగా నిధులు సేకరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే తనను మరోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎటర్నల్ లాభం నాలుగింతలు..
## ₹20,211 కోట్ల ఆదాయం




**బిజినెస్ డెస్క్ :**
జొమాటో, బ్లింకిట్ పేరిట ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎటర్నల్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నాలుగింతలకుపైగా నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.25 కోట్లుగా ఉన్న లాభం.. ఈ ఏడాది రూ.92 కోట్లకు పెరిగింది. ఈ మేరకు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. కార్యకలాపాల వల్ల వచ్చే ఆదాయం సైతం గతేడాదితో పోలిస్తే రూ.7,167 కోట్ల నుంచి రూ.20,211 కోట్లకు పెరిగింది. అదే సమయంలో ఖర్చులు రూ. 7,433 కోట్ల నుంచి రూ.20,314 కోట్లకు పెరిగాయి. ఫుడ్ డెలివరీ విభాగం జొమాటో నెట్ ఆర్డర్ వాల్యూ (NOV) ఏడాది ప్రాతిపదికన 20 శాతం వృద్ధి చెంది రూ.10,769 కోట్లకు చేరింది. క్విక్ కామర్స్ బ్లింకిట్ నెట్ ఆర్డర్ వాల్యూ 86 శాతం పెరిగి రూ.17,132 కోట్లకు చేరింది. పేటీఎం నుంచి కొనుగోలు చేసిన టికెటింగ్ ప్లాట్‌ఫామ్ డిస్ట్రిక్ట్ నెట్ ఆర్డర్ వాల్యూ 60 శాతం పెరిగి రూ.3,218 కోట్లుగా ఉంది. ఈ ఏడాది తొలి త్రైమాసిక ఫలితాలు సానుకూలంగానే ఉన్నాయని ఎటర్నల్ సీఈఓ, బ్లింకింట్ వ్యవస్థాపకుడు అల్బిందర్ సింగ్ ధిండ్సా అభిప్రాయపడ్డారు. నెట్ ఆర్డర్ వాల్యూ ఆశించిన స్థాయిలో వృద్ధి చెందిందని తెలిపారు. కంపెనీ దీర్ఘకాలిక వృద్ధి, వ్యాపారం, ఉత్పత్తుల విస్తరణపై దృష్టి సారించనున్నామని తెలిపారు. క్విక్ కామర్స్ విభాగంలో గడిచిన నాలుగేళ్లలో రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టామని, రాబోయే రోజుల్లో తమ వ్యాపారాన్ని మరింత విస్తరిస్తామన్నారు. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితుల వల్ల ముడి సరకుల ధరలు పెరిగి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఎదురైనా ఉత్పత్తి, సరఫరాపై ఎలాంటి ప్రభావం చూపలేదని చెప్పారు.

# జాబ్ మార్కెట్ హబ్..
## 'సిటీస్ ఆన్ ది రైజ్' నివేదికలో విశాఖ టాప్




**బిజినెస్ డెస్క్ :**
దేశంలో ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో విశాఖపట్నం అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ లింక్డిన్ తాజాగా విడుదల చేసిన 'సిటీస్ ఆన్ ది రైజ్' రెండో ఎడిషన్ జాబితాలో ఈ విషయం వెల్లడైంది. విశాఖ తర్వాతి స్థానాల్లో వరుసగా లుధియానా, సూరత్, వడోదర, ప్రయాగ్‌రాజ్, రాజ్‌కోట్, జబల్‌పూర్, రాంచీ, రాయ్‌పూర్, విజయవాడ నిలిచాయి. లింక్డిన్ నివేదిక ప్రకారం.. అత్యంత బలమైన జాబ్ మార్కెట్ కలిగిన, బయటకు వెళ్లేవారికంటే లోపలికి వచ్చే ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించారు. ఇందులో భాగంగా 10 నాన్ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించారు. ఈ నగరాల్లో ప్రతి ఖాళీ పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగిందని ఈ నివేదిక తెలిపింది. దేశ వృద్ధి మరింత విస్తరిస్తోందని, అభివృద్ధి చెందుతున్న నగరాలు తమకంటూ ప్రత్యేకమైన, బహుళ రంగాలతో కూడిన ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నట్లుగా ఈ నివేదిక స్పష్టం చేస్తోందని లింక్డిన్ కెరీర్ నిపుణురాలు నిరాజిత బెనర్జీ తెలిపారు. విశాఖపట్నం పోర్టు, ఫార్మా, తయారీ రంగంతో కూడిన ఆర్థిక వ్యవస్థను ప్రధానంగా ఏఐ, డేటా సెంటర్, టెక్నాలజీ ఆధారిత పెట్టుబడులతో అనుసంధానిస్తుండగా.. లుధియానా తన తయారీ రంగానికి ఉక్కు, విమానయానం, ఆతిథ్య రంగాలను జోడిస్తోందని నివేదికలో పేర్కొన్నారు. ఇకపోతే, సూరత్ టెక్స్‌టైల్, వజ్రాలకు అతీతంగా స్టార్టప్‌లు, ఎగుమతులు, రియల్ ఎస్టేట్ ద్వారా విస్తరిస్తుండగా.. వడోదర రసాయనాలు, యంత్రాలతో పాటు టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్‌ప్రైజ్ పెట్టుబడులను ఆకర్షిస్తోందని వివరించింది. మరోవైపు, విజయవాడ సైతం అదే పథంలో వెళ్తోందని.. ముఖ్యంగా ఐటీ, ఈగవర్నెన్స్ కంపెనీల నుంచి పెరుగుతున్న ఆసక్తి ఆ నగర వాణిజ్య ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని పేర్కొంది. ఈ 10 నగరాల్లోనూ తొలి మూడు నియామకాల్లో ఐటీ సేవలు, టెక్నాలజీ, కన్సల్టింగ్ సర్వీసులు ఉండగా.. మిగతా నగరాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు ఉన్నాయని పేర్కొంది.



# ఎల్‌నినో ముప్పు ముంచుకొస్తుందా?

**బిజినెస్ డెస్క్ :**
భారత్‌పై ఎల్ నినో ప్రభావం గట్టిగానే పడుతున్నది. వాతావరణంలో నెలకొన్న మార్పులు.. దేశాన్ని కరువు దిశగా నడిపిస్తున్నాయి. వ్యవసాయం, అనుబంధ రంగాలు దిగాలు పడగా.. మార్కెట్‌లో చోటుచేసుకున్న మందగమనం వ్యాపారపారిశ్రామిక రంగాలను కుదేలు చేస్తున్నది. జేఎం ఫైనాన్షియల్ ఇటీవల విడుదల చేసిన ఓ అధ్యయనంలో పేర్కొన్న అంశాలు ఇవే మరి. గడిచిన 25 ఏండ్లలో దేశీయ వ్యవసాయం, ద్రవ్యోల్బణంపై ఎల్ నినో ప్రభావం ఎలా ఉందన్నది ఈ సందర్భంగా వివరించింది. కాగా, 201516 తర్వాత ఈ 202627లోనే ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉందని ఈ సందర్భంగా తేలడం గమనార్హం. మొత్తం 13 ఆర్థిక, వ్యవసాయ సూచీల విశ్లేషణ ఆధారంగా ఈ అధ్యయనం జరిగింది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం, ద్విచక్ర వాహన అమ్మకాలు, ట్రాక్టర్ల విక్రయాలు, ఖరీఫ్ పంటల సాగు, ఆహారోత్పత్తి, రిజర్వాయర్లలో నీటి మట్టాలు, దేశ జీడీపీలో వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా, విద్యుత్తు డిమాండ్, రుణ లభ్యత వంటి ప్రధానాంశాల ప్రాతిపదికన ఈ సర్వేను జేఎం నిర్వహించింది.



**ఇదీ సంగతి..**
దేశీయ వ్యవసాయ రంగం అత్యధికంగా వర్షాధారమే. అయితే వర్షాలకు అనువైన నైరుతి రుతుపవనాలను ఎల్ నినో కారణంగా వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు అడ్డుకుంటున్నాయి. దీంతో వర్షపాతం తగ్గిపోతున్నది. 200001 నుంచి 202627 వరకు చూసినైట్లైతే 201516లో ఎల్ నినో తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నది. మళ్లీ ఈ ఆర్థిక సంవత్సరం (202627)లోనే ఆ ప్రభావం అధికంగా కనిపిస్తున్నట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. మధ్య, తూర్పు పసిఫిక్ సముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగడంతో వర్షానుకూల వాతావరణం దెబ్బతింటున్నది. ఈ పరిస్థితి భారత్ సహా అనేక దేశాల్లో అనావృష్టికి దారితీస్తున్నది. కాగా, లా నినా కూడా ఉంటుంది. దీనివల్ల సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పడిపోతాయి. ఫలితంగా అతివృష్టి సంభవిస్తుంది. 200708, 201011 ఆర్థిక సంవత్సరాల్లో ఇది బలంగా ఉన్నట్టు స్టడీలో తేలింది.

**సంక్షోభం అంచున..**
ఈ ఏడాది వర్షాకాలం మొదలై నెల రోజులు దాటిపోయింది. అయినప్పటికీ దేశంలో, ముఖ్యంగా తెలంగాణ, ఏపీ సహా ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాల ఊసే లేకుండాపోయింది. ఇప్పటికే నదీ ప్రవాహాలు లేక జలాశయాలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు సైతం అడుగంటిపోతున్నాయి. దీంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతున్నది. వచ్చే నెల రోజుల్లో వర్షాలు పడకపోతే ఆహారోత్పత్తి గణనీయంగా క్షీణిస్తుందని, ఇది ద్రవ్యోల్బణం విజృంభణకు కారణం కాగలదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కూరగాయలు, పండ్లు, పప్పు దినుసుల ధరలు పెరిగిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలూ పెరుగుతూపోతున్నాయి. ఫలితంగా తగ్గే ఉత్పాదకత, పెరిగే రవాణా ఖర్చులు.. రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణ గణాంకాలను పరుగులు పెట్టించడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇదే జరిగితే రాబోయే ద్రవ్య సమీక్షల్లో రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీరేట్లను పెంచేస్తుంది. దీంతో బ్యాంక్ రుణాలు ఖరీదెక్కుతాయని, ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)లకు పెట్టుబడుల కొరత వేధిస్తుందన్న ఆందోళనలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. చివరకు నిరుద్యోగం పెచ్చుమీరుతుందని, దేశ జీడీపీ ప్రగతి కుంటుబడుతుందంటున్నారు.

**అమ్మకాలపై ప్రభావం**
గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత ఆదాయం లేకపోతే మొదటగా ట్రాక్టర్లు, టూవీలర్ల అమ్మకాలు ప్రభావితమవుతాయి. గడిచిన 25 ఏండ్లలో లా నినా ప్రభావ సమయంలో ట్రాక్టర్లు, టూవీలర్ల అమ్మకాల్లో వృద్ధి 10.7 శాతంగా ఉంటే.. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పుడు 3.5 శాతానికి పరిమితమవుతున్నదని జేఎం ఫైనాన్షియల్ తాజా అధ్యయనం చెప్తున్నది. దీన్నిబట్టి ఈసారి వాహన విక్రయాలు అంతంతేనని చెప్పవచ్చు. కాగా, లా నినాతో పోల్చితే ఎల్ నినో దెబ్బకు వర్షపాతం, పంటల సాగు, ఆహారోత్పత్తి అన్నీ మైనస్ గణాంకాల్లోకి వెళ్తాయని, ద్రవ్యోల్బణం పెరుగవచ్చని ఈ స్టడీ చెప్తున్నది.

# మూడో రోజూ నష్టాల్లో సూచీలు.. మళ్లీ 24 వేల దిగువకు నిఫ్టీ

**బిజినెస్ డెస్క్ :**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా క్రూడాయిల్ ధరలు భారీగా పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా మూడో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. నిఫ్టీ 24 వేల మార్కు దిగువకు చేరింది. మూడు ట్రేడింగ్ సెషన్లలో కలిపి సెన్సెక్స్ 1400, నిఫ్టీ 300 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 77,384.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,470.11) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆపై మరింత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,641.19 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 715.06 పాయింట్ల నష్టంతో 76,755.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 191.45 పాయింట్ల నష్టంతో 23,996.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టైటాన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.74 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ధర ఔన్సు 4117.15 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# దేశీయ భాగస్వామ్యానికి ఫోక్స్‌వ్యాగన్ సై!




**బిజినెస్ డెస్క్ :**
జర్మనీకి చెందిన ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్, కొన్నేళ్లుగా మనదేశంలో ప్రయాణికుల వాహన (పీవీ కార్లు, ఎస్‌యూవీల) విపణిలో పట్టు కోసం ప్రయత్నిస్తోంది. స్థానికంగా వాహనాల తయారీకి పెట్టుబడి పెట్టి, మనదేశానికి ప్రత్యేకమైన ఉత్పత్తులనూ అభివృద్ధి చేసింది. తన ఇంజినీరింగ్ విభాగాన్ని ఇక్కడ విస్తరించింది. బ్రాండ్‌ల ప్రచార వ్యూహాలనూ మార్చింది. రెండు దశాబ్దాల పాటు ఇంతగా ప్రయత్నించినా కూడా దేశీయ కార్ల విపణిలో భారీ వాటా సంపాదించుకోలేకపోయింది. ఈ పరిస్థితి మార్చేందుకు దేశీయ సంస్థతో జట్టుకట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. గ్రూప్ ఆధీనంలో ఫోక్స్‌వ్యాగన్, స్కోడా, బెంట్లీ, లంబోర్గిని, పోర్షే వంటి బ్రాండ్లున్నాయి. ఇప్పుడు స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియాలో వ్యూహాత్మక పెట్టుబడి కోసం, దేశీయ సంస్థ జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌తో ఫోక్స్‌వ్యాగన్ ఉన్నత స్థాయి చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. స్కోడా ఇండియాలో నియంత్రణ వాటాను జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ దక్కించుకునే అవకాశం ఉందనీ చెబుతున్నారు. ఇందుకోసం కంపెనీ విలువ, పెట్టుబడి పరిమాణం, భవిష్యత్తులో పెట్టాల్సిన మూలధనం వంటి అంశాలపై చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం కుదిరితే, 2007లో మన దేశంలోకి ప్రవేశించినప్పటి నుంచి ఫోక్స్‌వ్యాగన్‌కు ఇదే అతిపెద్ద వ్యూహాత్మక మార్పుగా నిలుస్తుందని సమాచారం. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో జర్మనీలోని తన ప్లాంట్లలో కొన్నింటిని మూసివేస్తుండటంతో పాటు భారీ ఎత్తున ఉద్యోగులను ఫోక్స్‌వ్యాగన్ తొలగిస్తోందని వార్తలు వస్తుండగా, దేశీయంగా తాజా పరిణామం ఆసక్తికరం.

**ఏటా 2,85,000 వాహనాల ఉత్పత్తి సామర్థ్యం**
ఫోక్స్‌వ్యాగన్‌కు మనదేశంలో పుణె సమీపంలోని చకాన్, ఔరంగబాద్‌లలో తయారీ కేంద్రాలున్నాయి. ఫోక్స్‌వ్యాగన్, స్కోడా, బెంట్లీ, లంబోర్గిని, పోర్షే వంటి తన అన్ని బ్రాండ్లను సంస్థ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. టైగన్, వర్టస్, కుషాక్, స్లేవియా వంటి మోడళ్లను దేశీయంగా రూపొందించింది. పుణెలోని కేంద్రం ఏటా 2,25,000కు పైగా కార్లను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉండగా, ఛత్రపతి శంభాజీనగర్ (గతంలో ఔరంగాబాద్)లోని కేంద్రం 60,000 కార్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. సియామ్ గణాంకాల ప్రకారం, జూన్ త్రైమాసికం ఆఖరుకు ఫోక్స్‌వ్యాగన్, స్కోడా బ్రాండ్లు కలిపి మన దేశంలో 2% మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి. ఎగుమతి విపణిలో వాటి వాటా 10%. ఫోక్స్‌వ్యాగన్ వాహనాల ధరలు మాస్ మార్కెట్ కంటే కాస్త దూరంగా ఉంటాయి. దేశీయంగా అమ్మకాలు అధికంగా ఉండకపోవడానికి ఇదీ కారణమే.

# విదేశీ ఎక్స్ఛేంజీల్లో భారత కంపెనీల నమోదుకు నిబంధనల సరళీకరణ

**బిజినెస్ డెస్క్ :**
భారతీయ కంపెనీలు విదేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో నమోదు కావడానికి, విదేశీ పెట్టుబడుల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు సరికొత్త ముసాయిదా నిబంధనలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రతిపాదించింది. కేంద్ర బడ్జెట్ 202627లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనకు అనుగుణంగా.. విదేశీ మారకపు ద్రవ్య నిర్వహణ నిబంధనల్లో సమగ్ర మార్పులు తేవడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనలున్నాయి. సులభతర వ్యాపార నిర్వహణను మెరుగుపర్చడం, నిబంధనల్లో స్పష్టత తీసుకురావడం ముసాయిదా లక్ష్యం. దీనిపై ప్రజలు, పరిశ్రమ వర్గాలు తమ సలహాలను ఆగస్టు 31లోగా సమర్పించొచ్చు. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం.. భారతీయ పబ్లిక్ కంపెనీలు తమ ఈక్విటీ షేర్లను విదేశీ మార్కెట్లలో జారీ చేయడానికి లేదా ప్రస్తుత వాటాదారుల షేర్లను విక్రయించేందుకు కొన్ని షరతులతో అనుమతిస్తారు. సదరు షేర్ల విలువ రూపాయల్లోనే పుస్తకాల్లో నమోదు కావాలి. అవి డీమ్యాట్ రూపంలోనే ఉండాలి. దేశీయ మార్కెట్లలో నమోదైన కంపెనీలైతే అదనంగా సెబీ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఆ షేర్లు దేశీయ షేర్లతో సమాన హక్కులు కలిగి ఉండాలి. దేశీయంగా నమోదు కాని కంపెనీలు, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిబంధనలకు లోబడి ఉండాలి. దేశంలో నమోదు కాకుండా, విదేశాల్లో మొదటిసారిగా నమోదయ్యే షేర్ల ధరను బుక్ బిల్డింగ్ ప్రక్రియ ద్వారా నిర్ణయిస్తారు. విదేశీయులు, విదేశీ నియంత్రణలోని సంస్థలు కొనుగోలు, లేదా బహుమతుల రూపంలో తిరిగి స్వదేశానికి తీసుకెళ్లే లేదా తీసుకెళ్లలేని ప్రాతిపదికన దేశంలో పెట్టుబడులు పెట్టొచ్చు.



# భారత్ సిరీస్‌కు జింబాబ్వే జట్టు ఖరారు




**హరారే, జూలై 22 :** భారత్‌తో రేపటి నుంచి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు జింబాబ్వే క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ప్రపంచ ఛాంపియన్ భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలనే లక్ష్యంతో పలు కీలక మార్పులు చేసింది. స్టార్ ఆల్‌రౌండర్ వెస్లీ మధేవెరే, పేసర్ న్యూమన్ నియామ్‌హూరి జట్టులోకి తిరిగి వచ్చారు. యువ వికెట్‌కీపర్ బ్యాటర్ తఫాడ్జ్వా సిగా తొలిసారిగా టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్‌కు దూరమైన మధేవెరే తిరిగి జట్టులో చేరగా, గాయం నుంచి కోలుకున్న నియామ్‌హూరి కూడా అందుబాటులోకి రావడం జట్టుకు బలాన్నిచ్చింది. బంగ్లాదేశ్ సిరీస్‌లో ఆకట్టుకున్న తనాకా చివాంగా తన స్థానాన్ని నిలబెట్టుకోగా, క్లైవ్ మదాండే, టినోటెండా మపోసా, తషింగా ముసెకివా ఈసారి ఎంపిక కాలేదు. సికందర్ రజా నాయకత్వంలోని జింబాబ్వే జట్టు జులై 23, 25, 26 తేదీల్లో హరారే వేదికగా భారత్‌తో తలపడనుంది. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్‌లో జింబాబ్వే టెస్టు, వన్డే సిరీస్‌లను గెలుచుకుని మంచి ఆత్మవిశ్వాసంతో ఉంది. అదే జోరును కొనసాగిస్తూ స్వదేశంలో భారత్‌కు సవాల్ విసరాలని భావిస్తోంది.

**జింబాబ్వే జట్టు:**

సికందర్ రజా (కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, ర్యాన్ బర్ల్, తనాకా చివాంగా, బెన్ కర్రాన్, బ్రాడ్ ఎవాన్స్, వెస్లీ మధేవెరే, తడివానాషే మారుమణి, వెల్లింగ్టన్ మసకద్జా, బ్లెస్సింగ్ ముజారబానీ, డియోన్ మైయర్స్, రిచర్డ్ నగరావా, న్యూమన్ నియామ్‌హూరి, మిల్టన్ షుంబా, తఫాడ్జ్వా సిగా.




# డ్రంకెన్ డ్రైవింగ్ కేసులో వార్నర్

**సిడ్నీ, జూలై 22 :** ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ డ్రంకెన్ డ్రైవింగ్ కేసులో చిక్కుకున్నారు. ఈస్టర్ ఆదివారం మద్యం సేవించి వాహనం నడుపుతుండగా పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఆయన పట్టుబడ్డారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో వార్నర్ మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో ఆయనపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బిగ్ బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న వార్నర్ ఈ కేసు విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాలేదు. ఆయన తరఫున న్యాయవాది బాబీ హిల్ కోర్టులో హాజరై, వార్నర్ మద్యం సేవించిన విషయాన్ని అంగీకరిస్తున్నట్లు తెలిపారు. విచారణ సందర్భంగా న్యాయస్థానం డ్రంకెన్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమైన చర్య అని వ్యాఖ్యానించింది. వ్యాపారి అయినా, వైద్యుడైనా, ప్రముగీ క్రికెటర్ అయినా మద్యం సేవించి వాహనం నడపడం అందరికీ ప్రమాదమేనని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో తుది తీర్పును ఆగస్టు 18న వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. ఈ ఘటన నేపథ్యంలో డేవిడ్ వార్నర్ సిడ్నీ థండర్ జట్టు కెప్టెన్సీని కోల్పోయే అవకాశాలు ఉన్నాయని ఆస్ట్రేలియా క్రీడా వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# హాకీ ప్రపంచకప్‌కు భారత జట్టు ఖరారు

**న్యూఢిల్లీ, జూలై 22 :**

బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న పురుషుల హాకీ ప్రపంచకప్‌కు భారత జట్టును భారత హాకీ సమాఖ్య ప్రకటించింది. ఆగస్టు 15 నుంచి 30 వరకు జరిగే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ కోసం 20 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేసింది. స్టార్ డిఫెండర్ హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

ఇటీవల జరిగిన ప్రో హాకీ లీగ్‌లో ఆడిన నలుగురు ఆటగాళ్లకు ఈసారి ప్రపంచకప్ జట్టులో చోటు దక్కలేదు. డిఫెండర్ అమన్‌దీప్ లక్రా, మిడ్‌ఫీల్డర్లు రాజ్‌కుమార్ పాల్, రబిచంద్ర సింగ్ మొయిరాంగ్‌థెమ్, ఫార్వర్డ్ సెల్వం కార్తీని తుది జట్టులోకి ఎంపిక చేయలేదు. జట్టులో సమతుల్యత, అనుభవానికి ప్రాధాన్యం ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రపంచకప్‌లో భారత్ 'డి' గ్రూప్‌లో పోటీ పడనుంది. ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనున్న భారత్, ఆగస్టు 17న ఇంగ్లాండ్‌తో, ఆగస్టు 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లపై హాకీ అభిమానుల్లో ఇప్పటికే ఆసక్తి నెలకొంది. గత ప్రపంచకప్‌లో భారత్ ఆశించిన స్థాయిలో రాణించలేక తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఈసారి మాత్రం మెరుగైన ప్రదర్శనతో టైటిల్‌ను సొంతం చేసుకోవాలనే




లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ప్రపంచకప్ చరిత్రలో భారత్ ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే విజేతగా నిలిచింది. 1975లో జరిగిన ఫైనల్లో పాకిస్థాన్‌ను ఓడించి ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించింది. అలాగే 1971లో కాంస్య పతకం, 1973లో రజత పతకం సాధించిన ఘనత కూడా భారత జట్టు ఖాతాలో ఉంది. ప్రస్తుతం ఆ విజయాలను పునరావృతం చేయాలనే పట్టుదలతో భారత జట్టు సన్నద్ధమవుతోంది.

# వైభవ్‌పై భజ్జీ ప్రశంసల జల్లు



**న్యూఢిల్లీ, జూలై 22 :** భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ప్రతిభపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఎలాంటి భయం లేకుండా ఆడుతున్న తీరు అసాధారణమని కొనియాడాడు. తన సుదీర్ఘ క్రికెట్ ప్రయాణంలో ఇంత చిన్న వయసులో ఇంత ధైర్యంగా బ్యాటింగ్ చేసిన ఆటగాడిని చూడలేదని పేర్కొన్నాడు. యువ ఆటగాళ్లు తమ సహజశైలిలో ఆడేందుకు భారత క్రికెట్‌లో ప్రస్తుతం అనుకూల వాతావరణం ఏర్పడిందని అభిప్రాయపడ్డాడు. వైభవ్ ఐపీఎల్ అరంగేట్రానికి ముందు జరిగిన ఓ సంఘటనను హర్భజన్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు. తొలి బంతిని ఎలా ఆడతావని ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ ప్రశ్నించగా, తనకు అనుకూలమైన బంతి వస్తే తప్పకుండా సిక్సర్ కొడతానని వైభవ్ చెప్పాడని వివరించాడు. చెప్పినట్లుగానే అనుభవజ్ఞుడైన పేసర్ శార్దూల్ ఠాకూర్ వేసిన తొలి బంతినే సిక్సర్‌గా మలిచి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడని తెలిపాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్ ద్వారా భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. తొలి సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, త్వరలో జింబాబ్వేతో జరగనున్న టీ20 సిరీస్‌కు మరోసారి జట్టులో చోటు దక్కించుకున్నాడు. జింబాబ్వే పర్యటనలో తన ప్రతిభను నిరూపించుకునేందుకు వైభవ్‌కు మరో అవకాశం లభించింది. ఈ సిరీస్‌లో అతడు మెరుగైన ప్రదర్శన చేసి భారత జట్టులో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





# పాక్ క్రికెటర్లకు 'పాడెల్' శిక్షణ తప్పనిసరి

**లాహోర్, జూలై 22 :** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్ల ఫిట్‌నెస్, చురుకుదనం, ఫీల్డింగ్ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు వినూత్న నిర్ణయం తీసుకుంది. లాహోర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో 'పాడెల్' క్రీడను శిక్షణలో భాగంగా తప్పనిసరి చేసింది. కొత్త నిబంధన ప్రకారం అకాడమీలో శిక్షణ పొందే ప్రతి క్రికెటర్ రోజు విడిచి రోజు 40 నిమిషాల పాటు పాడెల్ ఆడాల్సి ఉంటుంది. పీసీబీ సీనియర్ సెలెక్టర్, హై పర్‌ఫార్మెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావెద్ మాట్లాడుతూ, పాడెల్ ద్వారా ఆటగాళ్లలో వేగం, రిఫ్లెక్స్‌లు, ఫిట్‌నెస్, ఫీల్డింగ్ సామర్థ్యం మెరుగుపడుతాయని తెలిపారు. ఇప్పటికే పలువురు ఆటగాళ్లు ఈ క్రీడ ఆడుతున్నప్పటికీ, కోర్టుల కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీంతో జాతీయ క్రికెట్ అకాడమీలో ప్రత్యేకంగా పాడెల్ కోర్టును నిర్మించినట్లు వెల్లడించారు. టెన్నిస్, స్క్వాష్ లక్షణాలు కలగలిపిన ఈ క్రీడ చిన్న కోర్టులో ఆడతారు. దీనికి అధిక శారీరక శ్రమ, ఓర్పు అవసరమవుతుందని, సరదాగా ఆడుతూ ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆకిబ్ జావెద్ పేర్కొన్నారు. అకాడమీని మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు బాస్కెట్‌బాల్ కోర్టులు, స్నూకర్ వంటి ఇండోర్ క్రీడల కోసం ప్రత్యేక హాళ్లను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే కృత్రిమ మేధ ఆధారిత బౌలింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తుచేస్తూ, జాతీయ క్రికెట్ అకాడమీని ఆటగాళ్లకు రెండో ఇంటిలా మార్చడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.






# అగ్రస్థానానికి అడుగు దూరంలో గిల్

**దుబాయ్, జూలై 22 :** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానానికి అత్యంత చేరువగా నిలిచాడు. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో నిలకడైన ప్రదర్శనతో గిల్ బ్యాటర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ 802 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, గిల్ 801 పాయింట్లతో కేవలం ఒక్క రేటింగ్ పాయింట్ తేడాతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. త్వరలోనే గిల్ నంబర్--1 ర్యాంక్‌ను అధిరోహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ల ఆధిపత్యం కొనసాగుతోంది. గిల్‌తో పాటు విరాట్ కోహ్లీ 767 పాయింట్లతో మూడో స్థానంలో, రోహిత్ శర్మ 758 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. దీంతో టాప్--4లో ముగ్గురు భారత బ్యాటర్లు చోటు దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. ఇంగ్లండ్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో గిల్ 188 పరుగులు చేయడంతో అతడి ర్యాంకు మెరుగుపడింది. అదే సిరీస్‌లో అద్భుతంగా రాణించిన ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ 249 పరుగులతో నాలుగు స్థానాలు ఎగబాకి ఎనిమిదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ రెండో స్థానంలో ఉండగా, భారత్‌తో సిరీస్‌లో ఐదు వికెట్లు సాధించిన ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ఒక స్థానం మెరుగుపరుచుకుని మూడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ పది స్థానాలు ఎగబాకి 32వ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో న్యూజిలాండ్ ఆటగాడు మైఖేల్ బ్రేస్‌వెల్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని కెరీర్‌లోనే అత్యుత్తమంగా మూడో స్థానానికి చేరుకున్నాడు. ఆఫ్ఘనిస్థాన్ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

చురకలు

గురువారం 23.07.2026

# 52 ఏళ్లకీ చెక్కుచెదరని అందం

ముంబై, జూలై 22 : హిందీతో పాటు తెలుగు సినీ పరిశ్రమలో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన సీనియర్ నటి ఊర్మిళ మటోండ్కర్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె వయసు 52 ఏళ్లు అయినప్పటికీ, తాజాగా సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న చిత్రాలు అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఆమె రూపం, ఫిట్‌నెస్, గ్లామర్‌ను చూసిన అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. హిందీలో విడుదలైన 'రంగీలా' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఊర్మిళ, అనంతరం వరుస విజయవంతమైన చిత్రాల్లో నటించి అగ్ర కథానాయికగా నిలిచారు. 1990వ దశకంలో తన నటన, నృత్యం, ప్రత్యేక శైలితో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు కూడా ఊర్మిళ సుపరిచితురాలే. అంతం, గాయం, మనీ మనీ, అనగనగా ఒక రోజు, భారతీయుడు వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు పొందారు. ముఖ్యంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కించిన చిత్రాల్లో ఆమె పోషించిన పాత్రలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. యాభై ఏళ్లు దాటిన తర్వాత కూడా తన ఫిట్‌నెస్‌ను, అందాన్ని అదే స్థాయిలో కాపాడుకోవడంపై అభిమానులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆమె పంచుకున్న చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారగా, "ఇప్పటికీ యువ కథానాయికలకు ఏమాత్రం తీసిపోని అందం" అంటూ నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.





# ఆలయ ఉత్సవాల్లో విజయ్, త్రిషతో బ్యానర్

## ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, స్టార్ హీరోయిన్ త్రిష పేర్లు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో తరచూ చర్చకు వస్తున్నాయి. వీరిద్దరి గురించి పలు రకాల ప్రచారాలు జరుగుతున్నప్పటికీ, వాటిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో తమిళనాడులో జరిగిన ఓ ఆలయ ఉత్సవంలో విజయ్, త్రిష చిత్రాలతో ఏర్పాటు చేసిన బ్యానర్ ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. తమిళనాడులోని సేలం జిల్లా ఆత్తూర్‌లో జరుగుతున్న మారియమ్మన్ ఆలయ ఆషాఢ ఉత్సవాల సందర్భంగా కొందరు యువకులు ప్రత్యేక బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఆ బ్యానర్‌లో విజయ్‌ను పది తలల రావణాసురుడి రూపంలో, త్రిషను అమ్మవారి రూపంలో చిత్రీకరించారు. ఈ డిజైన్ స్థానికంగా మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా వేగంగా వైరల్ అయింది. బ్యానర్ బయటకు రావడంతో నెటిజన్లు, స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పవిత్రమైన ఆలయ ఉత్సవాల్లో సినీ ప్రముగీల చిత్రాలను ఈ విధంగా ఉపయోగించడం సరికాదని పలువురు విమర్శించారు. ముఖ్యంగా దేవతా రూపాలతో నటీనటులను పోల్చి చూపడంపై ఆగ్రహం వ్యక్తమైంది. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో అధికారులు వెంటనే స్పందించారు. వివాదాస్పద బ్యానర్‌ను తొలగించడంతో పాటు, దానిని ఏర్పాటు చేసిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఘటనపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# తల్లిదండ్రులే నా బాధ్యత

**హైదరాబాద్, జూలై 22** : బుల్లితెర నటి శ్రీ సత్య తన వ్యక్తిగత జీవితం, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందుల గురించి మనసు విప్పారు. తల్లి వైద్య చికిత్స, సంరక్షణ కోసం ప్రతి నెలా రూ.2 నుంచి రూ.2.5 లక్షల వరకు గిర్చు అవుతోందని తెలిపారు. మందులు, ఫిజియోథెరపీ, సంరక్షణ కోసం సహాయకురాలి జీతం వంటి వ్యయాలన్నింటినీ తండ్రితో కలిసి భరిస్తున్నట్లు చెప్పారు. తమకు సొంత ఇల్లు, ఆస్తి ఏదీ లేదని, కుటుంబ వ్యాపారం నష్టపోవడంతో కరోనా కాలంలో ఉన్న ఇంటిని కూడా విక్రయించాల్సి వచ్చిందని శ్రీ సత్య వెల్లడించారు. తాను పని చేయలేని పరిస్థితి వస్తే తల్లిదండ్రుల భవిష్యత్తు ఏమవుతుందో అన్నదే తనను ఎక్కువగా భయపెడుతుందని చెప్పారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వదిలేయడం సరైనది కాదన్నారు. ఇటువంటి సంఘటనలు సమాజంలో పెరుగుతుండటం బాధ కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఇక తనపై వస్తున్న శరీరాకృతి విమర్శలపైనా శ్రీ సత్య స్పందించారు. హార్మోన్ల సమస్యల కారణంగా బరువు పెరిగానని, ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకోకుండా విమర్శించడం సరికాదన్నారు. ప్రతి ఒక్కరి శరీరంలో కాలానుగుణంగా మార్పులు సహజమని, వాటిని గౌరవించాలని సూచించారు.





# జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా: రేఖి

నటి రేగీ వేదవ్యాస్ తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణం, ఆరోగ్య సమస్యల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. చిన్న వయసులోనే జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని, అనుభవం లేకపోవడంతో ఆ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి సమయం పట్టిందని తెలిపారు. అయితే కాలక్రమేణా పరిస్థితులకు అనుగుణంగా తాను మారిపోయానని చెప్పారు. సినీ కెరీర్‌లో ఒక దశలో పని ఆగిపోవడం తనపై తీవ్ర ప్రభావం చూపిందని, అలాంటి పరిస్థితి మళ్లీ రావద్దని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో మంచి రోజులు, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, ఉపాధి, ప్రేమ ఉండాలని ఆకాంక్షించారు. గతంలో ఎదుర్కొన్న ఆరోగ్య సమస్య గురించి ప్రస్తుతం మాట్లాడేందుకు సిద్ధంగా లేనని రేగీ వేదవ్యాస్ స్పష్టం చేశారు. అది తన జీవితంలోని ఒక అధ్యాయమని, దేవుడి దయతో ఇప్పుడు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. ఆ సమయంలో తన కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ముంబైలో నివసిస్తున్నానని, అవసరమైతే హైదరాబాద్‌లోనూ పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. బిగ్‌బాస్ కార్యక్రమంలో పాల్గొనడం తన వల్ల కాదని రేగీ వేదవ్యాస్ స్పష్టం చేశారు. ఆ కార్యక్రమంలో పోటీదారుగా ఉండాలంటే ఎంతో ధైర్యం అవసరమని, అక్కడ పాల్గొన్న వారందరినీ అభినందిస్తున్నానని తెలిపారు. అయితే అతిథిగా లేదా సృజనాత్మక కార్యక్రమాల కోసం పిలిస్తే తప్పకుండా వస్తానని చెప్పారు. ప్రేక్షకులతో మరింత అనుబంధాన్ని పెంచే మంచి పాత్రలు

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com